# అగుపించని అంకుశాలు

ఆఫీసు నించి తిరిగివస్తూ పూలకొట్టుని చూసి రోడ్డుమధ్య హఠాత్తుగా ఆగిపోయాడు కృష్ణారావ్. అలవాటు ప్రకారం జేబీలు తడుము కొన్నాడు; కాని అందులో ఏమీ తగలక జాలిగా ఓసారి పువ్వులకేసి చూసి నడక సాగించాడు.

"ఏం బాబయ్యా ఇయ్యాల పువ్వులు తీసుకోకండా ఎల్లిపోతున్నారు?" అన్నాడు పూలమనిషి-రోజూ అణావో బేడో పూలు కొనుక్కోకండా ఆ దారిన వెళ్ళని కృష్ణారావుకేసి ఆశ్చర్యంగా చూస్తూ.

కృష్ణారావు ఆగి చిరునవ్వు నవ్వాడు. సమాధానం ఏదో ఒకటి చెప్పి తప్పించుకపోవాలనే తడబిడ కొద్దీ అన్నాడు. "ఈ వాళ వద్దోయ్...అవసరం లేదు"

"ఏం బాబు, యింట్లో వోళ్ళకి బాగుండ లేదా?"

కృష్ణ గతుక్కుమన్నాడు. నిజానికి యింట్లో అందరూ బాగానే వున్నారు. శాంత గూడా మామూలుగానే వుంది. తనూ బాగానే వున్నాడు. ఎటొచ్చీ జేబీలో మాత్రం ఆర్థికస్థితి ఎండిపోయింది. ఇలాగ తన దగ్గర డబ్బులు లేవని నిజంచెప్తే అతను అరువు తీసుకోమంటాడు. కానీ అరువులన్నా, బాకీలన్నా కృష్ణకి మహా భయం. అందువల్ల ప్రస్తుతానికి అబద్ధమాడైనా అక్కడనించి తప్పించుకపోవాలని "హాఁ...ఇంట్లో వాళ్ళకి కాస్త..." మిగతా మాటలు వినిపించకండా సొణుక్కుంటూ నడక సాగించాడు.

పూలమనిషి సానుభూతి కనపర్చాడు. ఆ వాక్యాలు వినకండానే కృష్ణదూరమై పోయాడు.

ఇల్లు సమీపించే కొద్దీ కృష్ణ మనస్సు ఎందుకో కలవరపడసాగింది. ఎప్పటిలానే ఈ వాళ గూడ శాంత గుమ్మం దగ్గరే ఎదురుతుంది-చిరు నవ్వుతో. కాని తన ప్రత్యామ్నా ఈ వాళ చిరునవ్వు తప్ప మరేం యివ్వలేడు. ఆశతో తనవేపు చూస్తుంది. కాని ఏముంటుంది? కాళీ చేతులే!

ప్రొద్దుట ఆఫీసుకి వెళ్ళేటప్పుడు, జేబీలో రెండుణాలున్నాయ్. అప్పుడు వాటి గురించి అంతగా పట్టించుకోలేదు.

> నేటి సమాజ జీవనంలో ఎంతటి అనుకూలమైన సంసారమైనా అగుపించని అంకుశాల పోట్లకు తాళుకోలేక పోతోంది. దేవుడువంటివాడనిపించుకున్న వాడైనాసరే పిశాచంగా మారిపోడంలో ఆశ్చర్యం లేదు.

గాని మధ్యాహ్నం అయేసరికి కడుపుకాలి మామూలుగా హోటల్‌కి వచ్చి కాఫీ తాగేశాడు. రెండణాలు మాయమై పోయాయి. సాయంకాలం పువ్వుల్ని చూసే వరకూ వాటి మీద ధ్యాసే లేదు. పోనీ మరో అణా ఎక్కువగా జేబీలో వేసుకొని వద్దామంటే-ఎక్కణ్ణించి వస్తుంది? తన జీతం డబ్భై-ఇటు అధికారులతో, అటు ప్రభుత్వంతో యుద్ధం చేయగా చేయగా కరువుభత్యం ఆ మాత్రం హెచ్చించారు. కాని తమకోసం ఎలాంటి శాసనాలు తయారు చెయ్యలేదు. చేతికందిన ఏడు నోట్లలో రెండునోట్లు ఇంటద్దెకి చెల్లించుకోవాలి. మిగిలిన దాంతో నెల ముప్పైదినాలు పొందికగా గడుపుకోవాలి. తన యింట్లో మొత్తం జనాభా తన తలిదండ్రులు, మొన్న పుట్టిన పాపాయితోబాటు ఐదుగురు. వీళ్ళ ప్రాణాలు కాస్తా బలవంతంగా గుటుక్కుమనకండా తను క్షణక్షణం బడ్జెట్లు తయారు చేస్తూనే వుంటుంటాడు.

పెళ్ళయి మూడేళ్ళయింది. ఇటు వివాహ కాంత, అటు ఉద్యోగ కాంత రెండూ ఒక్కసారే వరించాయి. ముత్తైదువలు కోడలు చల్లదనమన్నారు. కాని తనకి మాత్రం ఈరెండిటికీ గల సంబంధమేమిటో తెలియదు. అప్పట్లో అసలు ఉద్యోగమంటే ఏమిటో గూడ తెలీదు.

తలిదండ్రులు తనని పెంచి పెద్దచేశారు. తండ్రి పనిచేసిన కాలంలో కాస్తగా వెనకేసిన నాలుగు రాళ్లూ కొడుకు చదువుకి, ఆ చదువేదో పూర్తై యింట్లో నిరుద్యోగిగా వున్న మూడేళ్లలో కుటుంబ ఖర్చులకి

శ్రీ యస్. ఆర్. సంధి

పూర్తి చేసేశాడు. ఆ కూడబెట్టిన కొద్ది డబ్బుతోనూ కొడుక్కి తన చిహ్నంగా ఏదైనా చిన్న కొంప కట్టించాలను కొన్నాడు; కాని పరిస్థితులు ప్రతికూలిస్తే తను మాత్రం ఏం చెయ్యగలడు? ఇక అలా ఉపేక్షించి వూరుకొంటే లాభం లేదని కొడుకు వివాహం గురించి ఆలోచించాడు. చివరికి కాస్త పేరు ప్రతిష్ఠలున్న గౌరవ కుటుంబంనించే కొంతవరకూ చదువుకొన్న కోడల్ని ఎంచుకొన్నాడు. భార్య మెడలో కాసులు పేరు అమ్మి కొడుక్కి పెళ్లి చేశాడు. తర్వాత రెండు నెలల్లో కృష్ణకి ఉద్యోగం దొరికింది.

సంవత్సరంన్నర గడిచేసరికి తనుతండ్రి అయ్యాడు. మొదట్లో తన తండ్రి ఎదురుగా ఈ విషయాన్ని తలచుకొని సిగ్గుపడేవాడు. తన కొడుకుని ఎత్తుకొని తల్లిని సమీపించడానికి గుండె చాలేది కాదు. అప్పుడే తను జీవితంలోకి ఎలా ప్రవేశించాడు!

పితృత్వం సంపాయించినప్పటికీ కృష్ణ తన తల్లిదండ్రుల దగ్గర పిల్లవాడిలాగే సంచరించేవాడు. తెచ్చే జీతం అంతా తల్లికి యిచ్చేసేవాడు. తనకి అవసరం కలిగినప్పుడల్లా ఆమెని అడిగేవాడు. ఆవిడ మొట్టమొదట్లో అలానే యిస్తూవుండేది. కాని చివరికి ఒక రోజున మందలించింది:

"అంతంత దూబరాఖర్చులు చేసేస్తుంటే, తెచ్చే ఏభై రూపాయలు నెల ముప్పై రోజులూ ఎలా సరిపోతవనుకొంటావ్? నీ ఖర్చులకే నెలనెలకి పది రూపాయలు ఐపోతుంటే, మరి యింట్లో పరిస్థితులు గూడా చూస్తుండాలా?"

అప్పటినించి తల్లిని డబ్బడగడం చాల వరకు తగ్గించాడు. ఒక్కొక్కప్పుడు జడిసేవాడు గూడ, కానీ ఎంతైనా జల్సాచేసే చెయ్యి: డబ్బు ఆడక చింతుకొన్నట్టు వుండేది. ఆ సమయంలో తను అధికారపూర్వకంగా శాసించగలిగే వ్యక్తి ఒకరే వున్నారు ఆ యింట్లో.

"అమ్మాయ్, నాకు ఒక రూపాయి కావాలి ఏమంటావ్?" డాబుగా అడిగేవాడు.

"ఎందుకు?" అనేది శాంత.

"అదుగో! భర్త ఏదైనా అన్నపుడు భార్య 'ఎందుకు' 'ఎక్కడికి' 'ఏం' అంటూ కారణాలు అడగకూడదు. 'పతియే

సతులకు పరమదైవం' గాబట్టి భర్త అడిగిన తక్షణమే సర్వం త్యాగం చెయ్యాలి"

శాంత చిరునవ్వు నవ్వుతో డబ్బిచ్చేది. ఇచ్చిన తర్వాత కారణం అడిగేది. డబ్బు చేతిలో పడిన తర్వాత ఓ క్షణం అక్కడ వుంటేగా—ఒక్క గంటలో బైటకు ఉడాయించేవాడు,... తిరిగి రాత్రి ఏ పదింటికో వచ్చేవాడు. దాన్ని బట్టి శాంత వూహించుకొనేది. మహాశయుడు ఏదో సినిమాకి కొట్టేశాడని.

"ఐతే మీ రొక్కరేనా సినిమాలు చూడవలసింది, నాకవసరం లేదా?" అనేది కోపం నటిస్తూ.

"ఓస్! అదెంత. రేపు మరో రెండు రూపాయలు తీశావంటె సినిమా అన్నమాటేమిటి ప్రపంచమంతా తిప్పేస్తాను"

"బాగుంది. నా దగ్గర డబ్బెలా వుంటుంది — మీ రిస్తేనేగదా నా దగ్గరుంటుంది"

"అహ్హా! ఏం జేలస్ పాపం! మరి మీ నాన్నగారు నెల నెలా పంపించే పది రూపాయలు...?" అన్నాడు ,కొంటెగా ఒకనాడు.

అంతవరకు శాంత తన డబ్బు సంగతి అతనికి తెలియదనుకొంది. ఎలా కనిపెట్టేశాడో! ఇక దాస్తే లాభం లేకపోయింది ...అది మొదలు, అప్పటినించి కృష్ణ శాంతని ఒక్క క్షణం విడిచిపెట్టేవాడు కాదు.

పరిస్థితులు మెల్లమెల్లగా మారటం మొదలు పెట్టాయి. బజారులో బియ్యం మాయమయ్యాయి. రేషను కార్డుల మీద రెండవున్నలు తగ్గించారు. పన్నులు హెచ్చించారు. ఇల్లుగల ఆసాములు తదనుగుణంగానే అద్దెలు ఎక్కువ చేశారు. పదినించి పదిహేను, పదిహేనునుంచి ఇరవై ఐంది ఇంటద్దె. జీవన ప్రమాణం హెచ్చింది. కాని జీతాల్లో మార్పులు లేవు.

ఈ పరిస్థితుల్లో కృష్ణకి కొత్త కనువిప్పు కలిగింది. అంతవరకూ మార్కెట్టు అంటె ఏమిటో తెలియనివాడు సంచి డబ్బులు పట్టుకొని బజారుకి బయలుదేరటం ప్రారంభించాడు. పంచదారకోసం పడిగాపులు కాశాడు. బియ్యంకోసం క్యూలో నిలబడి కాలాన్ని నిర్దాక్షిణ్యంగా చంపుకొని వయసుని పెద్దది చేసుకొన్నాడు. పాపాయికోసం పాలడబ్బాలు ప్రియమయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లాడికి జబ్బుచేసింది. మొదట బద్ధకించారు. కాని చివరికది ఐదారు ఇంజక్షన్లు చేసేవరకు వచ్చింది. శాంత విడిగా మడిగట్టుక కూచోలేకపోయింది. తండ్రి పంపించే డబ్బులో కొత్తగా మిగుల్చుకొన్న దాన్ని, ఆనెల వచ్చిన పదిగూడ పిల్లాడి మందులకి కర్చు చేసింది.

నిజమైన పరీక్ష కృష్ణకి అప్పటినించి ప్రారంభమైంది. జీవితమంటె ఏమిటో మెల్లమెల్లగా అర్థం కాజొచ్చింది. సినిమాలు తగ్గించుకొన్నాడు. హోటలుమాట మరచిపోయాడు. వాసననూనెలు పోయాయి. కాబూలీ జోళ్ళ స్థానే రబ్బరుటైర్ల చెప్పులు తయారయ్యాయి. ఇస్త్రీ మడతలు తగ్గాయి. రోజూ సాయంకాలం ఆఫీసు నించి తిరిగొస్తూ మధ్యదార్లో కొనుక్కునే పావలా గులాబీ పువ్వులు ఒక్క అణాకి వచ్చాయి-ఈవాళ అదీ లేదు.

ప్రజలకి పేదరికానికి యింత గాఢ స్నేహం ఎందుకో అన్న సమస్యను సాధించడానికి పూనుకొన్నాడు. ఫలితంగా ప్రభుత్వోద్యోగుల్లో కలవరం బయలుదేరింది. స్వయంగా తమ కష్టాలని విన్నవించుకొన్నారు. నోటీసులు పంపారు. సత్యాగ్రహం చేస్తామన్నారు. సమ్మె మొదలు పెట్టడానికి తయారయ్యారు.

ఏమనుకుందో ప్రభుత్వం, మెల్ల మెల్లగా జీతాలు హెచ్చించింది.

కాని లాభం? జీవితావసర వస్తువుల ధరలు ఐదురెట్లు పెరిగాయి. కొన్ని బజార్లలో మాయమయ్యాయి. కర్షకులు కుక్షి కోసం అలో లక్ష్మణా అంటూ ఏడ్చారు. మన రామరాజ్యం చూడండయ్యా అని విమర్శించారు. మన రాజ్యం గాబట్టే మనం ఆకలికి కొట్టుక చావడంలో బాధ లేదు అన్నాయి పత్రికలు. ఈ పరిస్థితుల్లో దిన దినానికి అథః పాతాళానికి కృంగిపోతున్న సామాన్య కుటుంబీకులతో బాటే కృష్ణ గూడ కృంగిపో మొదలు పెట్టాడు.

తను బియ్యే పాసయ్యాడు. అమెరికా, బ్రిటన్ చరిత్రలు క్షుణ్ణంగా తెలుసు. రష్యాలో కార్మిక నియంతృత్వమో, సర్వ సమానత్వమో తెలుసు. చైనా, ఇండియాల సంబంధాలు గూడ తెలుసు. దక్షిణాఫ్రికా భారతీయుల కడగండ్లు తెలుసు, అరబ్ రాజ్యాల గంద్రగోళం తెలుసు. ప్రపంచంలో 'ఇజం'ల పేరిట సామాన్య ప్రజల స్వేచ్ఛని శాంతిని భగ్నపరచే కిరాతకు



"ఈ కొలువు చెయ్యకపోతే ఏమన్నా నష్టమా శాంతా" అన్నాడు కృష్ణ.

తెవరో తెలుసు, ఆంధ్రరాష్ట్ర సమస్య తెలుసు, తెలుగు లిపి సంస్కారం తెలుసు- ఒక్క మాటలో: ప్రాంతీయ, రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ సమస్యలన్నీ తనకు తెలుసు. కాని తనకా చదువులు ఒక్క ముఖ్యమైన సమస్యనే నేర్పించలేదు. ఆలోచించుకొంటుంటాడు ఎప్పుడూ: ఐతే నా పదిహేనేళ్ల చదువూ, యిన్ని వేల రూపాయల ఖర్చూ దండగేనా అని. తన తల్లిదండ్రులు తననియిందుకే చదివించారా? ప్రతిఫలం లేకండా యిన్ని వేల రూపాయల ఖర్చూ, యిన్ని లక్షల విద్యార్థుల బ్రతుకులూ బూడిదపోసిన పన్నీరు కావలసిందేనా? తన పొట్టని నింపలేని ఈ జ్ఞానాలు ఎందుకు? ప్రపంచ సమస్యలన్నీ అర్థమై, ఆకలితో గిలగిలా కొట్టుకొంటూ చచ్చేకంటే, ఏజ్ఞానం లేకండా, బురద పంధుల్లా బ్రతుకుతూ యితరుల మాన ప్రాణాలని దోచుకొనే బ్లాక్ మార్కెట్టే గొప్పదేమో?

అప్పుడప్పుడు కృష్ణ యిలానే అనుకొంటూండేవాడు: ఆ ఉద్యోగం వొదిలి తనూ ఓ చిన్న వ్యాపారం పెడితే? మెల్ల మెల్లగా తనూ ధనవంతుడై, సమాజంలో పేరు ప్రతిష్టలు సంపాయించుకో గలడుగా? వెంటనే నిస్పృహ: ఛా! యిలాంటి గాలిమేడలవల్ల ప్రయోజనం ఏవిఁటని.

గతాన్నంతనీ జ్ఞప్తికి తెచ్చుకుని, భూతానికి భవిష్యత్తుకి సంబంధం ఎలావుంటుందో అని ఆలోచించుకొంటూ వచ్చేస్తున్నాడు. ఇంతలో భుజం మీద ఎవరిదో చెయ్యి బరువుగా పడేసరికి పక్కకి తల తిప్పిచూశాడు. క్షణం పాటు ఆ వ్యక్తిని గుర్తుపట్టలేక గుడ్లప్పగించి వూరుకొన్నాడు.

"అదేవిట్రా, కృష్ణా, అలా వింతగా చూస్తావ్, నేనే రమణనిరా"

కృష్ణ ఆ నవాలు పట్టినట్టున్నాడు, చిరునవ్వు నవ్వాడు. "గుర్తుపట్టలేకపోయాను. సుమా, చాలా మారిపోయావ్...ఐతే యిప్పుడు గూడా యింకా బిజినస్సే చేస్తున్నావా?"

"ఆఁ అలాంటిదే మరొకటి చేస్తున్నాను గాని, నువ్వేం పూర్తిగా చిక్కిపోయావ్? కళ్లు గుంటలు పడ్డాయ్-ఏం యిప్పుడు మళ్లా పిల్లలా?"

"ఆఁ, ఒక్కడున్నాడు ప్రస్తుతానికి. పెద్దవాడు పోవడం నీకు తెలుసుగా...సరే ఆ మాటకేం గాని, నువ్వింక ఎంతకాలమిలా మాకు పార్టీ చెయ్యకండా తప్పించుకతిరుగుతావ్?"

"ఇక తప్పించుక తిరిగినా లాభం లేదురా బాబు-వచ్చే ఏడాది నిశ్చయమైపోయింది"

"ఏం-మళ్లా మరో ఏడాదికి వాయిదా వేశావేం?"

"వధువు బి ఏ. చదువుతోంది. అది పూర్తయితే గాని నేను చేసుకోనన్నాను. వాళ్ళు ఆర్థికంగా చాల బీదవాళ్ళు గాబట్టి యిక ఆ చదువుల మాట కట్టిపెట్టి ఎలాగోలాగున ఆపిల్లని వొదిలించుకోవాలని చూస్తున్నారు. కాని నా ప్రోత్సాహంతో మరి వాళ్ళు ఏమనుకొన్నారో కూతుర్ని యింకా చదివించాలనే నిశ్చయించుకొన్నారట...సరేరా, రేపు మళ్లా కలుసుకొందాం. వస్తా" రమణరావు వెళ్ళిపోబోయాడు.

"ఇంతవరకు వచ్చి మా యిల్లు చూడకండా వెళ్ళిపోతావా? రారా...కొస్త ఆ వాతావరణాలని పరీక్షిస్తే నీలాంటి ధనవంతులకి సామాన్య తరగతి ప్రజల జీవితాలు తెలుస్తాయి"

రమణరావు చిరునవ్వు నవ్వాడు. "ఇప్పుడంటె నాలుగు డబ్బులు కూడాయిగాని, మొట్టమొదట నేనూ నీలాంటి సామాన్యుణ్ణని మరచిపోయావేవిఁట్రా?"

కృష్ణ గూడ నవ్వి స్నేహితుని భుజం తట్టాడు.

"నాలుగు డబ్బులు చేతిలో నాట్యమాడుతుంటె, మనిషిగూడా దానికి తగ్గట్టె తాళం వేస్తుంటాడురా రమణ. వెనక అనుభవించిన ప్రతీ అంశాన్ని యిట్టే మరచిపోతాడు"

"నువ్వు చెప్పిన సుభాషితం నిజమే. కాని మానవ నైజమంతా ఒకే విధంగా వుండదు తెలుసా?"

కృష్ణ నవ్వి స్నేహితుని చెయ్యపట్టుకొని నడక సాగించాడు.

దార్లో తన చరిత్రంతా రమణరావు చెప్పాడు.

తండ్రిపోయిన తర్వాత ఇంటి బాధ్యతంతా తనమీద పడింది. ఇంతవరకూ చేస్తున్న వ్యాపారాన్ని క్రితం ఏడాది ఆపేసి, వున్న డబ్బంతటితో విశాఖజిల్లాలో ఓ చిన్న పంచదార ఫ్యాక్టరీ కట్టించాడు. అందులో మొత్తం వందమంది పని చేస్తారు. కూలీల వేతనాల్లో చాల శ్రద్ధ తీసుకొన్నాడు. గరిష్ఠకనిష్ఠ వేతనాలకి ఆట్టే తేడా లేదు. ప్రత్యేకం వాళ్ళకోసం ఓ డాక్టరు. అన్నిటికంటె ముఖ్యమైంది: ఫ్యాక్టరీ ఉత్పత్తి మీద వచ్చిన లాభాల్లో కూలీలకు గూడా వాటా వుంది. దీనివల్ల తనకీ వాళ్ళకీ మధ్య అంత గొప్ప దూరం




## శతమూలికాదిలేహ్యము

లోహాభ్రకసింధూరముతో సహా సేవించిన సమస్తసుఖవ్యాధులు, ఎఱుపు తెలుపు మచ్చలు, బగ్గెలు నపుంసకత్వము నివారించి వీర్యవృద్ధి, బలము, నరముల పటుత్వము కలుగజేయును స్త్రీలబుతుశూలలు, కుసుమరోగములు, నష్టసంతానము నివారించి మంచిసంతానము కలుగజేయును. 40 దినములకు మందు రు 18.

## శ్రీ భుజంగరాజ వైద్యశాల

తాళ్ళరేవు, తూర్పు గోదావరి జిల్లా.

## కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.

ఏమీ లేకపోయింది. కూలీ జనానికి తన మీద భక్తి గూడ ఏర్పడింది.

ఈ చరిత్రంతా విన్న తర్వాత మరి కృష్ణ మాట్లాడానికి ఎలాంటి ప్రయత్నమూ చేయ లేదు. ఇంతలో యిల్లు వచ్చింది.

వాకిట్లో శబ్దం విని పరుపు మీద పడుకొని పేపరు చదువుకొంటున్న శాంత గభుక్కున లేచి లోపలికి రాబోయింది. ఇంతలో వాళ్ళిద్దరు లోపలికి వచ్చేశారు. ఆ అపరిచితుణ్ణి చూసి శాంత ఛప్పున తిరిగి లోపలికి వెళ్ళిపోయింది. రమణరావు వచ్చి కుర్చీలో కూచొన్నాడు. కృష్ణ షర్టు విప్పుతూ ప్రారంభించాడు:

"ఇదుగో అంతా కలిసి యిదే యిల్లు. ఈ గది లోపల చిన్న గది, వంట వసారా— ఇంతే. దీనికే అద్దె యిరవై."

రమణరావు నవ్వుకొంటూ గదినంతనీ ఒకసారి కలియ చూశాడు.

"పోనీ అద్దె పోతే పోయిందిగాని..." అంటూ అటు గుమ్మం కేసి ఒక కొంటె చూపు విసిరి చిరునవ్వు నవ్వుతో "ఆ దూరాన అగుపిస్తున్న కృష్ణ, కొండలు మీకు నిత్యజవ్వనాన్ని యిస్తాయి కదూ" అన్నాడు.

"ఆఁ ఆఁ, ప్రకృతిని ప్రేమిస్తూ కూచొన్నట్టయితే పొద్దుపోయినట్టే." అంటూ కృష్ణ లోపలికి వెళ్ళాడు.

అవతల గదిలో వున్న శాంత, భర్త లోపలికి రాగానే: "ఎవరాయన?" అంది.

"చిన్ననాటి స్నేహితుడు, రమణరావని. నాతో బాటే ఇంటర్ నించి బియ్యే వరకు చదివాడు. ప్రస్తుతం విశాఖపట్నానికి మకాం మార్చేశాడు—మొదట్లో యిక్కడే. వున్నప్పటికీ ఇక్కడ వాళ్ళ పెద్దక్క వుంది. అవిణ్ణి చూడానికి వచ్చాడట... సరే గాని వాడికి 'టీ' చెయ్యాలి — ఏమంటావ్?"

"నేనే మంటాను—మీరు పాలు తెస్తే సరి"

"సరి సరి, హోటల్‌కి వెళ్ళి అది తీసుకొచ్చే బదులు, ఆ కాఫీని అక్కడే నోట్లో పోసేసుకొంటె నయం"

"చాల మంచిమాటే చెప్పారు. అదే నేమిటి మర్యాద?"

"మరేం చెయ్యాలి?"

"పోనీ వుండండి, నేనే ఎవరినైనా అడిగి తెస్తాను." శాంత వెనక్కి తిరిగింది.

"పోనీలే శాంతా, నీకా శ్రమెందుకు— వాడికి అసలు సంగతి చెప్పేస్తే వొదిలి పోతుంది"

"ఏమని?"

"అరే భాయ్, మేం డబ్బులేక టీ అలవాట్లు తప్పించుకొన్నామని."

"అయ్యొయ్యొ! ఏమిటండి మీరు మరీ యిదిగా మాటాడుతారు!"

"ఫర్వాలేదు, వాడికలాంటివి లేవులే"

శాంత ఆటంక పరుస్తున్నా లెఖ్ఖ చేయకండా కృష్ణ స్నేహితునితో ఈ మాటలు నవ్వుకొంటూ చెప్పేశాడు. పైగా శాంత ఈ విధంగా అంటున్నట్టుగూడ అనేశాడు. చాటుగా వున్నప్పటికీ శాంత సిగ్గుతో చచ్చిపోయింది. రమణరావు చిరునవ్వుతో అవతలగదిలో వున్న శాంత నుద్దేశించి.

"ఏడి మాటలు నాకేం కొత్తవి కావు లేమ్మా. చిన్నతనం నించి వీడి మన స్తత్వం కుండ పగలగొట్టినట్టు ముఖంమీద అనుకొన్న మాటని అనెయ్యడమే" అన్నాడు గట్టిగా.

ఈ మాటలకి శాంత చిరునవ్వు నవ్వుకొన్నప్పటికీ మనస్సులో "చాలా గొప్పపనే! ఇదేనేమిటి మర్యాదంటె? ఎంత స్నేహితుడైతే మట్టుకి అంత కట్టె విరచినట్టు మాటాడుతాడా?" అనుకొంది కోపంగా.

స్నేహితులిద్దరూ మళ్ళా బయటకు వెళ్ళిపోయారు.

ఆ రాత్రి శాంత కెందుకో భోజనం సహించలేదు. జ్వరం తగులుతుందేమో ననుకొంది. ఎనిమిదయేసరికి వళ్లు కాస్త జోగింది. అత్తగారితో చెప్పి పాపాయిని పక్కలో వేసుకుని అందరికంటె ముందుగా నిద్ర పోయింది.

తెల్లవారిన తర్వాత శాంత జ్వరం పూర్తిగా దిగిపోయింది. కాని పక్కలో వున్న పాపాయి మాత్రం తీవ్రమైన జ్వరంతో వణికి పోతున్నాడు. శాంతకి కంగారు పుట్టింది. వాణ్ణి ఛప్పున ఎత్తుకొని భయంతో గాఢంగా కౌగిలించుకొంది. ముఖం లోకి చూసింది. బాగా పాలిపోయింది. భయంతో గబగబ లోపలికి అత్త దగ్గరకు తీసుకవెళ్ళింది.

"ఏమిటి, ఏమిటి శాంతా?" అంది అత్త కంగారు పడుతూ.

"చూడండత్తయ్యా, బాబు ఎలా వున్నాడో నా కెందుకో భయమేస్తోంది. ఆయనతో చెప్పి త్వరగా డాక్టర్ని తీసుకరమ్మనమనండి"

గొడవ విని కృష్ణ వచ్చాడు. ఈ దృశ్యాన్ని చూడగానే అంతా అర్థమైంది. ఇంతకముందు ఒక దెబ్బతిని వున్నాడు. తన ఉపేక్షవల్లే పెద్దవాడు పోయాడు. ఇప్పుడు అలాగే ఉపేక్షిస్తే, ఇది మరింత ముదిరిపోతుంది. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడంలో లాభం లేదు. గబగబా డాక్టరు దగ్గరకి పరుగెత్తాడు.

తిరిగి డాక్టరుతో వచ్చే సరికి పిల్లాడికి అంత జ్వరం వున్నట్టు కనిపించలేదు. డాక్టరు పిల్లాణ్ణి పరీక్షించి, కొద్దిగా జ్వరం అని ఏదో రెండు మాత్ర లిచ్చాడు. సాయంకాలానికి తగ్గకపోతే ఇక జక్షనిస్తానన్నాడు.

ఇంజక్షను మాట వినేసరికి శాంత గుండెల్లో రాయిపడింది. ప్రతి చిన్న జ్వరానికి పిల్లలకి గూడా ఇంజక్షనెందుకు? అన్నిటికీ ఒకటే మంత్రమా? దేని కేది యిస్తారో తెలీదు. నీళ్లనే మందులని యిచ్చినా నమ్మవలసిందే. శాంత ఈ బూటకాల మందులు వద్దని హఠం చేసింది. కృష్ణ చాల వరకు చెప్పి చూశాడు. నమ్మకం మీదే లోకం



నెం. 10 గణపతి మొదలి వీధి, రాయపేట, మద్రాసు 14.

వస్తుంది కాంతా-అన్నాడు. కాని కాంత మాత్రం ఈ ఇంజక్షన్లకి ఒప్పుకొంది కాదు.

సాయంకాలం పిల్లాడు వులాసాగా వున్నాడు. డాక్టరు ఎందుకైనా మంచిదని ఇంజక్షను యిస్తానన్నాడు. కాని యీసారి తల్లి గూడా వద్దని పట్టుపట్టింది. అదేమందు యిచ్చి డాక్టరు వెళ్ళిపోయాడు.

తెల్లవారేసరికి జ్వరం పూర్తిగా తగ్గిపోతుందనుకొన్నారు. కాని పిల్లాడి శరీరం మీద అక్కడక్కడ చిన్న చిన్న పొక్కులు కనిపించాయి. మధ్యాహ్నానికి మరింత ఎక్కువయ్యాయి. డాక్టరు వచ్చి అది మశూచి అని ధృవపరచి వెళ్ళిపోయాడు.

ఈ జబ్బుకి మందులు మాకులు వేస్తే పిల్లాడు తమకిక దక్కడనే మూఢనమ్మకం సుందరమ్మకుంది. కృష్ణ ఎంతో నచ్చ చెప్పాడు. కాని వినిపించుకోలేదు. కాంత ఎటూ చెప్పలేక పోయింది. ఆ కొడుకుని చూసుకొంటూ తిండి గూడా మానేసింది.

రెండు రోజులు గడచేసరికి పిల్లాడి శరీరం మీద సూదిమోపేంత స్థలమన్నా లేకండా అంతా యినపతొడుగు. పిల్లాడు బాధపడలేక కిరకిర్లాడి పోయేవాడు. వాడి అవస్థ చూడలేక కాంత కుమిలిపోయేది. రాత్రీ, పగలూ యిదే సేవ. వాడొకవేళ బ్రతికి బయటపడ్డా యింతక ముందున్నంత ఆకర్షణ వాడిలో వుండదు. ముద్దొచ్చే బుగ్గలు, శరీరచ్ఛాయ, ఆకృతి అంతా మారిపోతుంది-తలచుకొనేసరికి కాంత గుండెల్లో శూలాలు పొడిచేవి.

నాలుగోనాడు రాత్రి యింట్లో మరింత గాభరా చేసింది. మంచం మీద పిల్లాణ్ణి చూస్తూ కూర్చున్నారంతా. కాంత ఎంత నిలదొక్కుకొన్నా వచ్చి పడిపోతున్న ఏడుపుని ఆపుకోలేక పోతోంది. కృష్ణకి పిల్లాడు బ్రతుకుతాడనే ఆశలేదు. సుందరమ్మ విసురుతూ కూచొంది.

రాత్రి ఒంటిగంటకి అందరికీ చిన్న నిద్రపట్టింది. ముసలాయన బయట పడక కుర్చీలో వాలిపోయాడు. కృష్ణ గోడకి అంటిపెట్టుకుని కళ్ళు మూసుకొన్నాడు. మెలుకవగా వున్నదల్లా కాంత ఒక్కర్తే. ఇల కోళ్ళ చప్పుడు తప్ప అంతా నిశ్శబ్దం. పిల్లాడు తుళ్ళిపడి ఒక్కసారే 'మా' అని అరిచాడు. అదిరిపోయి అందరూ చుట్టూ మూగేసరికల్లా పిల్లాడు నిలువునా యింతెత్తున లేచి విరుచుక పడిపోయాడు. అంతే! తన కళ్ళతో ఈ దృశ్యాన్ని చూసిన కాంత భయంతో పిచ్చిగా అరచి పిల్లాడి మీద పడిపోయింది. క్షణంలో గదిలో యిల కోళ్ళ ఈలలు ఆగి విషాద శబ్దాలు రంయ్ మన్నాయి.

* * *

పాపాయి పోయిన దగ్గరనుంచి కాంతలో చాల మార్పులు కలిగాయి. భోంచెయ్యదు; మాటాడదు, మగతగా కూచున్న దగ్గరే వుండిపోతుంది. ఎంతోమంది నచ్చజెప్ప జూశారు. లాభంలేక పోయింది. 'జరిగిపోయినవన్నీ జ్ఞాపకం తెచ్చుకొని కుమిలిపోతుంటే, పోయిన ప్రాణం తిరిగి వొస్తుందా' అన్నారు. ఇవి మరింత కలవర పెట్టడానికే వుపయోగపడ్డాయి గాని వూరడించడానికి ఏమాత్రం వుపకరించలేదు.

కృష్ణకి కాంత పరిస్థితి చాల ఆందోళనని కలిగించింది. వెంటనే కాకినాడకి మామ గారిని అర్జంటుగా రమ్మంటూ ఉత్తరం రాశాడు. మర్నాటికల్లా కాంతారావు గారు చిన్న కొడుకుని వెంటబెట్టుకొని వచ్చారు.

చిన్న తమ్ముడంటె కాంతకెంతో ప్రేమ. తనకి పెళ్ళయినపుడు వాడికి ఏడేళ్ళు. ఆ వయస్సులో వాడికి పెళ్ళంటె ఏమిటో అర్థంగాక ఒకరోజున అక్కయ్యని అడిగేశాడు: 'పెళ్ళంటె ఏమిటే' అని. ఆమాటలు విని తనకి సిగ్గు, సిగ్గుతో బాటు కోపం గూడ వచ్చింది. పళ్ళు బిగించి కోపాన్ని నటిస్తూ 'ఛా! వెంగి భడవా, అలాంటి మాటలు అడగొచ్చా?" అంది. వాడుముఖం ముడుచుకొన్నాడు సిగ్గుతో. కాంతకి వాడి మూగనటన జాలిని కలిగించింది. దగ్గరికి తీసుకొని ముద్దుపెట్టుకొంటూ ఆ మాట మరిపించడానికి చిన్న పాట పాడింది. తాత్కాలికంగా వాడు ఆ మాటని మరచిపోయాడే గాని, పెళ్ళంటె అక్కయ్య శాశ్వతంగా ఆ యిల్లు విడిచి అత్తవారింటికి వెళ్ళిపోతుందని, ఆమె బండెక్కిన వరకు తెలుసుకోలేకపోయాడు. ఇక తెలుసుకొన్నాడు, ఆమెని విడిచిపెట్టాడు కాదు. శత పోరు పెట్టాడు; తనూ అక్కతోబాటు వెళ్ళిపోతానని. కాంతకి కళ్ళనీళ్ళు తిరిగాయి. తల్లి తండ్రీ వాణ్ణి బుజ్జగించి మెల్లగా ఊరడించారు. కాని ప్రతీపండక్కీ వస్తూ, తిరిగి వెళ్ళిపోయేటప్పుడు కాంత మెడని చుట్టేసి 'మళ్ళా ఎప్పుడొస్తావక్కా?' అని ఏడ్చేవాడు. తిరిగి రావడానికి ఏడాదులు గడవాలా ఏమైనా? తెలుగు పంచాంగంలో నెలకో పండగ తే? ఇదే కాంత సమాధానం. వాడు ఎలానో దుఃఖాన్ని దిగమింగుకొని వెళ్ళిపోయే అక్కయ్యకు వీడ్కోలు యిచ్చేవాడు. కాని ఈ మధ్య సంక్రాంతికి వచ్చిన కాంత ఉగాదికి రాలేదు. ఎదురు చూసిన రాము నిరాశతో కూలిపోయాడు. ఇంతలోనే ఈ సంఘటన. నాలుగు నెలల తర్వాత తిరిగి తన పుట్టింటివాళ్ళని చూసింది. అందులో పిల్లాడుపోయి పుట్టెడు దుఃఖంలో వుంది. తమ్ముణ్ణి చూడగానే మరి ఆ శక్తి ఎక్కణ్ణించి వచ్చిందో అమాంతంగా లేచి వాణ్ణి పట్టుకొని ఏడ్చేసింది.

పరిస్థితులన్నీ తెలుసుకొని కాంతారావుగారు కొన్ని రోజులపాటు కూతుర్ని తనతో బాటు తీసుకవెడతానన్నారు. కృష్ణ సమ్మతించాడు. అత్తమామలు సరే అన్నారు. మర్నాడే తిరుగు ప్రయాణం నిశ్చయమైంది.

పుట్టింట్లో గూడ కాంత మొదట రెండు రోజులూ దిగాలుగా వుండేది. స్నేహితు


రు 1000 బహుమానం

లెప్రర్ క్యూర్

(రిజిష్టర్డు)

కుష్టు, బొల్లి, సుఖరోగాదులకు గ్యారంటీ చికిత్స.

అన్ని భాషలలోను కేటలాగు ఉచితం.

లక్ష్మి అండ్ కో

(రిజిష్టర్డు)

H. O. షాత్తేరు, ఆర్. యస్.

బ్రాంచీలు:

2/135 బ్రాడ్వే, మదరాసు.

గాంధినగర్, విజయవాడ.

కటక్, సికింద్రాబాదు,

రాజమండ్రి etc.



స్టీల్ మాష్టరు

(మడత కుర్చీలు)




అథరైజ్డు డీలర్సు

మాధవ అండ్ కో

పార్కురోడ్డు, బెజవాడ

రాండ్రు సహపాఠిణులువచ్చి పలకరించినా ఏదో ముగతగా జవాబులిచ్చేది. చంటి పిల్లల్ని మాత్రం దగ్గరగా తీసుకొని ఆడించేది.

ఆ కిటుకుని కనిపెట్టిన తల్లి కూతుర్ని నవ్వించడం కోసం పక్కింటి ప్లీడరుగారి చిన్నపిల్లాణ్ణి తీసుకొచ్చి శాంత దగ్గర మెల్లగా అలవాటు చేసింది. సాయంకాలం అయ్యేసరికి ఎలాగూ రాము బడినించి తిరిగి వచ్చేసేవాడు. వీళ్ళందర్నీ డాబా మీదకి తీసుకపోయి కబుర్లుచెప్పేది.

పది రోజు లయ్యేసరికి శాంత తిరిగి మామూలుగా తిరగడం మొదలు పెట్టింది. ఆరోగ్యం గూడ బాగయింది. మెల్లగా సాయంకాల మయ్యేసరికిముస్తాబై స్నేహితు రాండ్ర దగ్గరకి వెళ్ళేది.

మరోవారం దినాలైన తర్వాత తల్లి స్వయంగా బయలుదేరి కూతుర్ని బెజవాడ దిగబెట్టి అక్కడనాలుగైదు రోజులు వుండి తిరిగి వచ్చేసింది. శాంతలో పూర్తి మార్పు కలిగింది. ఫర్వాలేదని అందరు సంతోషించారు.

కృష్ణకి ఎప్పటినించో మనస్సులో ఒక కోర్కె వుంది. ఎలాగైనా ఏ విధంగానైనా డబ్బు మిగిలించి శాంతకి చిన్న గొలుసు చేయించి ఆమెకి తెలీకండా అగస్మాత్తుగా ఆమె మెళ్ళోవేసి దిగ్భ్రమ పరచాలని. ఉపాయాలు ఆలోచించాడు. తన యింటి బడ్జెట్టులో ఏ ఖర్చును తగ్గించాలో పరీక్షించాడు. చివరికిడబ్బంతా తనచేతిలో వుంచుకొని కావలసిన ఖర్చంతా తనే చెయ్యాలని నిశ్చయించుకొన్నాడు. జీతం అందగానే యింటద్దె చెల్లించి మిగతాది జాగ్రత్తగా ఖర్చు చేశాడు. పాపం ఖర్చు మాత్రం చాలా జాగ్రత్తగానే చేశాడు— కాని జీతమందినరెండువారాల్లోనే జేబీలు ఖాళీ ఐపోయాయి. ఎలా ఐపోయిందో కిటుకు తెలీలేదు. లాభం లేక ఏం ఎరగనట్టు యింటి బాధ్యతంతా తిరిగి ఆడ వాళ్ళకే అప్ప జెప్పేశాడు—చివరికి శాంత వెక్కిరింపుల్ని గూడ చచ్చినట్టు సహిస్తూ.

శనివారంనాడు శాంత తులసి పూజ చేయడానికని తెల్లవారే లేచి కృష్ణలో స్నానం చేసి యింటికొచ్చింది. పూజకి కావలసిన సామగ్రి కొనడానికి భర్తని డబ్బడిగింది. కృష్ణ జేబులో డబ్బు లేదు. తల్లిని అడగమన్నాడు. శాంతకి యింట్లో పరిస్థితులు అంతగా తెలీవు. ఆ నెల ఆఖరి రోజది; మర్నాటికిగాని కృష్ణకి జీతాలు అందవు. ఈ విషయం తెలియక శాంత తిన్నగా వెళ్ళి అత్తగారిని పూజ గురించి డబ్బడిగింది. సుందరమ్మ మాటాడకండా ఒక రూపాయి యిచ్చింది. కాని శాంతకి తెలీదు. ఆ రూపాయే ఆ నాటి భత్యమని. పూజ చేసిన పర్యవసానంగా ఆ రాత్రి ఆ యింట్లో ఆ రెండు ముసలి జీవాలు పస్తులతో పడుకున్నాయి.

అత్త మామలవి చాల లోతు గుండెలు. ఈ పస్తులు గురించి కృష్ణకిగాని శాంతకిగాని తెలియనివ్వలేదు. ఐనా ఈ విషయాన్ని కృష్ణ ఎలానో పసి కట్టేశాడు. ఏం చేస్తాడు? మరచిపోడానికి ప్రయత్నించాడు.

మరొకరోజు శాంతకి బొమ్మల కొలువు పెట్టాలని బుద్ధి పుట్టింది. మహా ఐతే పది



రూపాయలుకంటె ఎక్కువ ఖర్చు కాదని అంచనా వేసుకొంది. తండ్రి పంపించిన పదితోనూ అన్నీ సరిపుచ్చుకోవాలని కొలువుకి సిద్ధపడింది. ఈ హంగామా అంతా చూసి కృష్ణ శాంత పక్కకి వచ్చి ఆమె వేపు చూడకుండా బొమ్మల గుంపులోకి దృష్టిని పోనిస్తూ అన్నాడు మెల్లగా.

"ఈ కొలువు చెయ్యకపోతే ఏమన్నా నష్టమా శాంతా?"

శాంతకి ప్రశ్న అరం కాలేదు. తన మామూలు సహజ ధోరణిలో చిరునవ్వు నవ్వుతూ "ఏం?" అంది.

కృష్ణ తడబడ్డాడు. తల అడ్డంగా తిప్పుతూ దృష్టిని తప్పించుకోడానికి ప్రయత్నం చేశాడు. కాని శాంత ముఖంలోకి చూడకుండా వుండలేక పోయాడు. చూసిన తర్వాత మాటలు రాలేదు. "ఏం... ఏం... లేదు... స... రె.. స.. రె" అన్నాడు చివరికి—ఆ ఖర్చు పెట్టేది ఆమె తండ్రి పంపిన సొమ్మని తిరిగి బలవంతంగా జ్ఞప్తికి తెచ్చుకొంటూ.

తన దగ్గర అతను ఏదో దాస్తున్నాడని శాంత అనుమానించింది. ఎదురుగా వచ్చి నిలబడి ఒకసారి మనిషిని పరీక్షగా చూసింది. ఆ వాలకం ఎందుకో ఆమెని భయపెట్టింది. దిగజారి పోతున్న స్వరంతో అడిగింది మెల్లగా.

"అలా అంటున్నారేం? ఎందుకలా అంటున్నారు?"

స్వరంలో స్ఫురించిన దీనత్వం కృష్ణని మూగగా వుండనివ్వలేదు.

"శాంతా!... నిన్ను ఆటంక పరచను, కాని డబ్బులేనపుడు యిలాంటివన్నీ మనకెందుకు? పూజలూ పునస్కారాలూ అంటూ రాళ్లకి రప్పలకీ ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తే మన స్థితి మరింత క్రిందకి దిగజారి పోతుందిగాని, దేవుళ్లు దయ తలచి మనకి మంత్రించి పరమాన్నాలని యివ్వరు, మన స్థితిని మార్చరు..."

అప్పటికీ శాంతకి, కృష్ణ మనస్సులో మోగుతున్న ఈ ధనస్సేవిటో పూర్తిగా అర్థం కాలేదు. కాసేపు పూరుకొన్న తర్వాత తిరిగి కృష్ణ అన్నాడు:

"ఒక మాట చెబుతాను మనస్సు కష్టపెట్టుకోకు శాంతా ... మొన్న నువ్వు పూజకి తీసుకొన్న రూపాయి జ్ఞాపకముంది కదూ? ఆ వాళ మా అమ్మ దగ్గర ఆ ఒక్క రూపాయి తప్పించి మరేం లేదు. ఇంట్లో వున్న కాసిని బియ్యం మనకి వండి వాళ్ళిద్దరు పస్తు పడుకున్నారు"

శాంత నిర్ఘాంతపోయి కృష్ణకేసి చూస్తూ వుండిపోయింది. కృష్ణ మరిక అక్కడ నిలవలేదు, బయటికి వెళ్ళిపోయాడు.

అది మొదలు—శాంత ప్రతీ చిన్న విషయంలోను భయపడుతూనేవుంది. స్నానం కోసం వేడినీళ్లు పెట్టుకొంటె కట్టెలు తరిగి పోతవని భీతి; ముందుగా భోంచెయ్యడానికి వెనకనున్న వాళ్ళకి మిగులుతుందో లేదో అని భయం. నూనె రాచుకోడానికి బెంగ. నోరు విడిచి భర్తని ఏదైనా పత్రిక కొని తీసుకరమ్మని చెప్పడానికి దిగులు—చివరికి చాకలికి బట్టలు వెయ్యడం దగ్గర నించి, సినిమాలకి వెళ్ళాలనే వూహా తట్టే వరకు-ప్రతీ విషయంలో ఆమె దృష్టి బెదురుతూనే వుండేది. ఈ భయం చివరికి అలవాటుగా మారిపోయింది.

పర్యవసానంగా ఆరోగ్యం క్షీణించ మొదలు పెట్టింది. చూస్తుండగానే తీతిక పుల్ల ఐపోయింది. నోటికి అన్నం సయించదు, ముచ్చటగా ముస్తాబవదు. ఈ వాలకాన్ని చూసి మొట్టమొదట సుందరమ్మ ఏదో వూహాగానం చేసింది: తను త్వరలోనే మనమణ్ణి ఎత్తుకోగలనని సంబరపడింది. కాని త్వరలోనే తన వూహాకి అది వ్యతిరేకమని తెలిసిపోయింధి. తర్వాత కొడుకుని ఎన్నోసార్లు హెచ్చరించింది. చివరికి ఒక రోజు విసుగెత్తి కొడుకు భోంచేస్తున్నపుడు:

"ఆ ఉన్న కాస్త ఆరోగ్యం పూర్తిగా యిదైపోకముందే ఏ ఓవల్టినో, ఏ టానిక్కో యిస్తే ఎంత బావుంటుంది?... నీకు చెప్ప చెప్ప నా నోరు పడిపోయింది. పోనీ శాంతన్నా యిలాగని గట్టిగా చెబితే తెచ్చేవాడివేమో. కాని అది మంటిబుక్కడం—ఊఁ అంటే ఊఁ. ఆఁ అంటె ఆఁయే! నువ్వు ఆఫీసుకి వెళ్ళేటప్పుడు ఒక సారి గుర్తుకి తెమ్మని యిన్నిసార్లు చెప్పానా? ఊహుఁ! 'ఆఁ ఆమాత్రం జ్ఞాపకం వుండదా,' అంటుంది. నువ్వు చూస్తే రోజు రోజుకీ పరగడుపు" అంది.

తల్లి మాటల్ని శాంతంగా విని కృష్ణ మెల్లగా అన్నాడు: "చేతిలో డబ్బుండొద్దమ్మా? అనగానే పెళ్లా?" అన్నాడు.

"సరె అది కాస్తా ముదిరిన తర్వాత ఎలా చేసుకొంటావో చేసుకో" అంటూ సుందరమ్మ లేచి లోపలికి వెళ్ళిపోయింది.

కృష్ణ ఛప్పున తలెత్తి చూశాడు. తల్లి కోపంగా వెళ్ళిపోయింది గాని, శాంత మాత్రం తలుపు పక్కనే అంటిపెట్టుకొని వుంది. దృష్టి ఆమె చుట్టూ పరిభ్రమించింది. రోజూ చూస్తున్న శాంతే. కాని ఈవాళ కృష్ణ దృష్టికామె కొత్త వ్యక్తిలా కనిపించింది. ఈ వ్యక్తికి మూడేళ్ళ క్రితం శాంతకి అసలు పోలికే లేదు. ఆ స్థితిలో ఆమెని చూసి మరిక కృష్ణకి అన్నం సహించలేదు. లేచి చేతులు కడుక్కొని వెళ్ళిపోయాడు.

భర్త ప్రవర్తన శాంతకి చాల ఆశ్చర్యాన్ని కలిగించింది. అతని వెనకనే వెళ్ళింది.

"ఏం భోంచెయ్యకుండా లేచిపోయారు?"

"కడుపు నిండి పోయింది"

కాసేపటివరకు తన వెనకనించి ఎలాంటి సమాధానం రాకపోవడంతో అనుమానం వేసి కృష్ణ వెనక్కి తిరిగాడు. శాంత అక్కడే నిలబడి వుంది. కళ్లల్లో నీళ్లు సుళ్లు తిరుగుతున్నాయి.

"ఏడుస్తున్నావా శాంతా?"

శాంత కంగారుగా కళ్లు తుడుచుకొని అతని చేతికందకుండా వెనక్కి తిరిగి పోయింది.

ఆ రాత్రంతా కృష్ణకి నిద్ర పట్టలేదు. కళ్లు మూసుకొనేప్పుడెల్లా శాంతే ప్రత్యక్షమయ్యేది. ఆమె అలా కృశించిపోతూ వుండడానికి తనే కారణమేమో! తను గూడ కాదు-తనకి తెలియని ఏదో దురదృష్టం, తను గూడా పెద్ద పెద్ద ఆఫీసర్లలాగే ఎనిమిది గంటలూ పని చేస్తున్నా తన కాలానికి డబ్బై, వాళ్ళ కాలానికి లెక్కకట్టలేని విలువ! ఏ న్యాయసూత్రాలో, ఏ శిలాశాసనాలో నిర్దయగా తనకి, తనకుటుంబానికి, తన సంసారానికి ఒక దుర్భర దారిద్ర్యాన్ని అంటగట్టి, కాలంతో బాటు, మరో నికృష్ట నీచస్థితికి బరబరా అధఃపాతాళానికి లాక్కుపోతున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో శాంతకి నిజంగా జబ్బుచేసి మంచం పట్టినట్లయితే తను చేయగలిగింది ఆమె పీకనులిమి చంపెయ్యడమే. అంతకంటె గొప్ప 'ఉద్ధరణ' తనకేం చేతనవుతుంది?...

తెల్లవారింది. ఏమైనాసరే శాంతకోసం కొన్ని బలమైన టానిక్కులు తీసుకరావాలని నిశ్చయించుకొన్నాడు. రమణరావుని అడిగి ఇరవై తీసుకొంటె-అవి తీర్చేమాట తర్వాత (అసలు వాడిచ్చేది ఎప్పుడూ అప్పుగా యివ్వడు.)—శాంతిని తిరిగి మనిషిగా చెయ్యొచ్చు.

ఇదే తలంపుతో ఆఫీసుకి వెళ్ళేముందు రమణరావు అక్కగారింటికి వెళ్ళాడు కృష్ణ. కాని అతను రెండు రోజులక్రితమే వెళ్ళిపోయాడని తెలుసుకొని శిలై పోయాడు. దరిద్రుడు కాలు కదిపితే వడగళ్ల వాన ఎదురౌతుంది. ఇక తనకి అప్పిచ్చే వాళ్ళెవరు?...ఇవ్వగలరని ఆశించిన కొద్ది మందీ తలలుఅడ్డంగాతిప్పారుబాధపడుతూ. చివరికి తన దృష్టి పథంలో పడినవారు ఒక్క మేనేజరే.

(ఇంకా వుంది)

# అగుపించని అంకురాలు

(గతసంచిక తరువాయి)

జీల పూర్తి కానిదే ఆఫీసునించి ఒక్క చిల్లిగవ్వైనా రాదని తెలుసుండి గూడా కృష్ణ మెల్లగా మేనేజరుతో తన సంగతంతా చెప్పుకొని, అంతవరకు ఒక పది రూపాయలు యిమ్మని వేడుకొన్నాడు. అక్కడా లాభం లేకపోయింది. ఇన్ని దినాల ముఖపరిచయమున్నప్పటికీ ఆఫీసర్‌కి తనకీ స్నేహం ఏర్పడలేదు. ఆ అధికారాలు పైన వున్నంతవరకు స్నేహ భావమనేది పూజ్యమే నేమో!

సాయంకాలం వరకు అలానే పని చేశాడు. విడుకొట్టిన తర్వాత ఎవరిమటుకి వాళ్ళు లేచి వెళ్ళిపోతున్నారు. కృష్ణకి లేవడానికి బుద్ధి పుట్టలేదు. లేచి తిన్నగా యింటికి వెళ్ళడం తను అక్కడ ఏ స్వర్గాన్ని ఆశించి? ఏ ముంది ఆ యింట్లో? ఎప్పుడూ వాళ్ళకి కనిపించకుండా యిక్కడే వుండిపోతే?

లాభం లేదు. ఇది ఆఫీసేగాని యిల్లు కాదు. ఇక్కడ మతి పోగొట్టుకోడానికే గాని, మతి స్థిరపరచుకోడానికి కాదు. లేచి చుట్టూ చూశాడు పక్కనున్న టైపిస్టు యింటికి వెళ్ళిపోడానికి సిద్ధపడుతున్నాడు. ఏమనుకొన్నాడో కృష్ణ ఛప్పున లేచి అతన్ని గట్టిగా పట్టుకొని-

"మూర్తి, బ్రదర్ ఒక పది వుంటే అప్పియ్యవోయ్. నీకు త్వరలోనే యిచ్చేస్తాను. ప్లీజ్ యింట్లో చాల యిబ్బందిగా వుంది." అన్నాడు.

మూర్తి కృష్ణకేసి ఎగాదిగా చూసి, జేబిలోంచి ఒక కాగితాన్ని తీసిచ్చాడు.

"ఇంతకు మించి నా దగ్గర ఎక్కువ లేదు కృష్ణ"

కృష్ణ నోటుకేసి చూసుకొన్నాడు. ఒక రూపాయ నోటు. ఎందుకు పనికొస్తుంది? ఓవల్టిన్ డబ్బా వస్తుందా? నాలుగు రోజులు బలమైన ఆహారానికి వస్తుందా? ఐనప్పటికీ మూర్తి మాట తీసెయ్యకుండా సమయానికి సహాయం చేయగలిగినందుకు అస్పష్టంగా అభినందనాలు చేసి యింటిదారి పట్టాడు.

దార్లో శాంతగురించి ఎన్నో వూహించుకొన్నాడు. తనని చూడగానే ఎదురుగా వస్తుందనుకొన్నాడు. చిరునవ్వుతో ఛప్పున లేచి లోపలికి వెళ్ళిపోతుందనుకొన్నాడు. కాని అవేం జరగలేదు. అసలు అరుగుమీద శాంతే అగుపించలేదు.

బతికాననుకొని లోపలికి వెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు.

అత్తగారు రోజూ చేస్తున్న ఒత్తిడివల్ల శాంత ఈవాళ ఏమైనా సరె ఆయన వచ్చీ రాగానే మొట్టమొదట తన ఓవల్టిన్ను డబ్బాల గురించి గట్టిగా అడగాలని నిశ్చయించుకుంది. అరుగుమీద చెప్పులచప్పుడు వినిపించగానే తరుగుతున్న కూర విడిచిపెట్టి వంటగదిలోంచి వచ్చింది తలపట్టుకొని వున్న భర్తని చూసేసరికి మరి ఆ నిశ్చయం ఏమయిందో దీనంగా ఒక్క నిట్టూర్పు విడిచి వూరుకొంది. కాని లోపలనించి అంతర్వాణి గోలపెడుతూనే వుంది. చివరికి మెల్లగా దగ్గరకి వచ్చి వినీ వినిపించనట్టు అంది.

"ఓవల్టిన్ తెచ్చారా?"

తనని ఎవరో అంకుశంతో పొడిచి జ్ఞాపకం చేసినట్టు ఉలుక్కుపడి తలెత్తి ద్వారం వేపు చూశాడు కృష్ణ. ఆ చూపు ఎంతోసేపు ఆ వ్యక్తి మీద నిలవలేదు. సిగ్గుపడుతూ సమాధానంగా తల అడ్డగా తిప్పాడు.

దిగజారిపోతున్న ధైర్యం, గింగురుమంటున్న అత్తగారి మాటలు ఈ ఒక్క వ్యతిరేక సమాధానంతో ఆగి ఛప్పున వెనక్కి తిరిగాయి. గట్టిగా "ఏం?" అంటూ అరచింది, తన అధికారాన్ని వినియోగించుకొంటున్నట్టు.

శరీరమంతా భూమిలోకి కూరుకుపోతున్నట్టనిపించింది కృష్ణకి.

ఆ ఉద్వేగంలో శాంత తనని తాను సంబాళించుకోలేక పోయింది. "అత్తగారన్నట్టు నేను చచ్చిన తర్వాతగాని మీరు నా వేపు చూడరు."

వంటిమీద తుమ్మరువ్వులు ఛల్లుమన్నంత బాధపడ్డాడు కృష్ణ-ఈ మాటలతో. ఈ బాధ ఒక విన్నమైన ఉక్రోషంగా మారిపోయింది. తన చుట్టూ వెక్కిరించేటట్టు తిరిగే ధనవంతులందరి మీదా చెప్పలేనంత కసి కోపం కలిగాయి. ఆ ఉద్వేగం ఎదురుగా వున్న శాంత రూపం మీదికి మనోదుర్బలతగా ప్రసరించింది. బుసలు కొడుతూ శాంతకేసి చూశాడు.

"నాన్న పంపే డబ్బుని గూడ నాకు తినేందుకు హక్కు లేదు." అంది శాంత తన కడుపు మంటకొద్దీ, చీరకొంగుతో కళ్లు తుడుచుకొంటూ.

"మీ నాన్న పంపించేది నేనా తిన్నాను?" కటువుగా అరచాడు.

ఆ అరుపుల్ని విని సుందరమ్మ గబగబ అక్కడికి వచ్చింది.

కాని శాంత, "అవును తప్పకుండా ముమ్మాటికీ" అనే మాటల్ని విసరడం, కృష్ణ ఆ ఉద్రేకంలో లాగి చెంపమీద కొట్టడం, ఆమె రాక నిష్ఫలమే ఐంది.

శాంత కళ్ళనీళ్లు తిరిగిపోయాయి. ఏడవడానికైనా శక్తిలేక అత్తచేల్లో వాలి, ఆమెని అనుకొని లోపలికి వెళ్లిపోయింది.

ఆ ఉద్రేకంలో, తాను చేసిన పని ఎంత నీచాతి నీచమైనదో కృష్ణ ఊహించుకోలేకపోయాడు. అంత మొరటుగా ప్రవర్తిస్తాడని గూడ వూహించలేకపోయాడు. వెళ్లిపోతున్న శాంతికేసి చూశాడుగాని ఆ దృష్టిలో చిట్టచీకటి తప్పించి మరేదీ కనిపించలేదు.

చాలా సేపటికిగాని ఈ స్థితినించి కోలుకోలేక పోయాడు. కోలుకొన్న తర్వాత శరీరమంతా ముచ్చెమటలు పట్టి కంపించిపోతోంది.

"శా-ం-తా"

రెండక్షరాలు, మధురంగా, సౌందర్యంగా, సుకుమారంగా ప్రతిధ్వనించవలసిన పొడి అక్షరాలు! కాని అవి విడివిడిగా గొంతు ముడికిందే అంతరించిపోయాయి. స్వరభావం స్ఫురించేటట్టు పెదవు లస్పష్టంగా కదిలాయి.

ఒక అడుగు ఛప్పున అప్రయత్నంగా ముందుకు పడింది-శాంతని క్షమించమని వేడుకోవాలని. కాని తను ఒక్కక్షణం క్రితం చేసిన పని జ్ఞాపకం రాగానే సిగ్గుతో కృంగిపోయాడు.

రాత్రంతా కళ్లకి కునుకులేదు. ప్రతీక్షణం శాంతే కళ్ళనీళ్లు తుడుచుకొంటూ

(13-వ పేజీ చూడండి)

# అగుపించని అంకుశాలు

(8-వ పేజీ తరువాయి)

వెళ్ళిపోతున్నట్టు కనిపించేది. అప్పటికే మించిపోయింది లేదు—వెళ్ళి శాంతని చూడాలను కొనేవాడు. సాహసం చాలక తిరిగి వాలిపోయేవాడు.

తెల్లవారిన తర్వాతగూడా శాంతని పిలవడానికి సాహసించలేక పోయాడు. రాత్రి సిగ్గుతో పస్తుపడుకోవడం మూలాన ప్రొద్దుట లేవగానే కడుపు మాడింది. ఐనా తన పరిస్థితిని చెప్పుకోడానికి అభిమానం అధైర్యం వేధించాయి. వసారాలో సుందరమ్మ పెట్టిన భోజనాన్ని కిక్కురుమనకండా తిని వెళ్ళిపోయాడు.

ఆఫీసుకి ఎలా అడుగులు వేసుకొంటూ వెళ్ళగలిగాడో—వెళ్ళీ వెళ్ళగానే తన సీట్లో కూలబడిపోయాడు. మూర్తి వచ్చి భుజం మీద చెయ్యివేసేసరికి తుళ్ళిపడి తలెత్తి చూశాడు.

"అరె! నీ కళ్ళనించి...!" మూర్తి ఆశ్చర్యంగా చూశాడు.

కృష్ణ కంగారుగా కళ్ళు తుడుచుకొన్నాడు.

"ఏం కృష్ణ, యింట్లోవాళ్ళకి ఎలా వుందేవిఁటి?" సానుభూతిగా ప్రశ్నించాడు మూర్తి.

"అబ్బె... అబ్బె... ఏంలేదు మూర్తి" అని విషయాన్ని మార్చె ఉద్దేశంతో, నిన్న అతనిచ్చిన రూపాయినోటు జేబీలోంచి తీసి అందిస్తూ అన్నాడు: "ఈ ఒక్క రూపాయి చాల్లేదు మూర్తి"

మూర్తి నోటు తీసుకొంటూ చిరునవ్వు నవ్వాడు—తన అశక్తతని దానివెనుక దాచుకొంటూ.

"మనలో మనం సమయానికి సహాయాలు యింతకంటె ఎక్కువ చేసుకోడానికి యింతా చేసి మన బ్రతుకులెంత?"

నిజమే అనుకొన్నాడు కృష్ణ. తనకంటె పెద్ద హోదాల్లో వున్నవాళ్ళని తను అప్పు అడగడానికి తగడు; వేనకవేలు రూపాయల్ని భద్రంగా దాచుకొన్న ధనవంతుల్ని 'ధర్మం బాబూ' అని అడుక్కోలేడు; జాలిగా తన స్థితిని చూసి సమయానికి ఆదుకోవాలను కొన్న వాళ్ళదగ్గర ఆ సహాయం చేసే శక్తిలేదు.

సాయంకాలం వరకు మనిషి యిక్కడే గాని మనస్సు ఎక్కడో పనిచేసింది. ఒక్క రోజులో మనిషి చేసేవాడు ఎన్ని తప్పులు చెయ్యగలడో అన్ని తప్పులు చేశాడు. అందుకు తోడు తలనొప్పి. సాయంకాలం అయేసరికి మేనేజరు న్యాయంగా పిలిచి చీవాట్లు పెట్టాడు.

"చేస్తున్న పనికి జాగృతి అవసరమని నేను జ్ఞాపకం చెయ్యనవసరం లేదు. మనిషికి జీతం యివ్వడం అక్కర్లేంచి సవ్యమైన పని కావాలిసొచ్చిగాని, ఎవరి మటుకు వాళ్ళు కాలాన్ని సోమరిగా చంపెయ్యడానికి కాదని గుర్తించుకో"

మేనేజరు మాటలు ఉక్కుసూదుల్లా సూటిగా హృదయంలో ముక్కలయ్యాయి... అవును ఆ ముష్టి విశైరూపాయల జీతం తనని, తన శక్తిని, తన మనస్సుని, చివరికి తన మానవత్వాన్నే కొనేసింది. చేతగాని వేదాంతంతో వళ్ళుని చల్లబరుచుకోబోయాడు.

దారిపొడుగునా మనిషికి ఒంటిమీద స్పృహ లేదు. జీవితంలో ఎప్పుడూ పుట్టని నైరాశ్యం, నిస్పృహ కలిగాయి. తనని పరివేష్టించివున్న పరిసరాలన్నీ తనకోసం తన్ని చిత్రవధ చెయ్యడంకోసం, తన్ని హాస్యాలపాలు చెయడంకోసం, తన్ని పీడించుక తినడంకోసం కనిపెట్టుకొని వున్నాయి. ఏవిఁటో జీవితం!

ఎంతైతే తన దురదృష్టానికి దారిపొడుగునా ఖేదిస్తూ వచ్చాడో, యింటికి వచ్చేసరికి ఎదురుగా తల్లి వచ్చి "తెచ్చావా?... అబ్బే ఎందుకు జ్ఞాపకముంటుంది" అని ఎత్తిపొడవగానే అంతా కృంగిపోయాడు.

మెల్లగా లోపలికి వచ్చి మంచంమీద కూలబడి రెండు చేతులతో ముఖాన్ని దాచుకొని కళ్ళు మూసుకొన్నాడు. అక్కడ ఆఫీసు. అగ్గికి ఆజ్యం తోడయే ట్టు యిక్కడ యింట్లో పరిస్థితులు. నిలకడలేని మనస్సు... ఇంతలో తిరిగి తల్లి మాటలు వినిపించాయి.

"నిన్న చేసిన ఘనకార్యానికి...శాంత ...శాంత కాదు నీ "యిల్లాలు" ఇంతవరకూ వచ్చి మంచినీళ్ళైనా ముట్టుకోలేదు."

"హాఁ!" ఆశ్చర్యంగా తల్లికేసి చూశాడు.

"ఎందుకా ఆశ్చర్యం? నీకు కావలసింది అదేగా? ఈ మధ్యలో అది అలా కుళ్ళి కుళ్ళి ఛస్తే అప్పుడు నీకూ వీళ్ళని పోషించే బాధ తగ్గుతుంది—మా మటుకి మేం ఏ మూలకో పోయి ముష్టెత్తుకొంటాం"

కృష్ణ మాటాడక పోవడం చూసి సుందరమ్మ ఈసారి రెట్టిస్తూ.

"నిన్న అదేమందని అంతలా చేతికొచ్చినట్టు కొట్టుకొన్నావ్? అది చచ్చిన

32 సంవత్సరముల అనుభవముగల
రెడ్డి అండ్ కో., వారి
(రిజిష్టర్డు)
కుష్ఠు, బొల్లి, సుఖ రోగోది
చికిత్సలకు నేడే సంప్రదించండి.
నకలు మందులు చూసి మోస పోకుడు
అన్నిభాషలలో కేట్లాగు ఉచితము.
హెడ్ ఆఫీసు: రెడ్డి అండ్ కో.,
గోపాలపురం.
(తూర్పుగోదావరి)
బ్రాంచిలు:- నెల్లూరు, బెజవాడ, రాజమండ్రి
సికింద్రాబాద్, విశాఖపట్నం, బరహంపురం
మొదలగు పట్టణములలో.

భారతప్రశస్తి


స్త్రీల ఆరోగ్య భాగ్యానికి
లోధ్ర
కేసరికుటీరం లిమిటెడ్, మద్రాస్

తర్వాతగాని అటు చూడవ్. లేకపోతే ఎప్పటినించి చెబుతున్నాను. నీ కర్చు కాస్త తగ్గించి దానివేపు కన్నెత్తి చూడ మంటూ? అటు చూసిన పాపాన పోయావా? చివరికి దానికి విసుగొచ్చి అడిగితే తల తిరిగి పోయేటట్టు కొట్టి తోసేస్తావా? అవును అది అడిగిన దాంట్లో ఏం తప్పుందని? వాళ్ళ నాన్న పంపించే పది గూడా కాజేస్తూ, అది అడిగిందని యింత పౌరుష మొచ్చిందే-అది నిజం కాదా?"

కృష్ణ గుండెల్లో ఈ శూలాలు తగిలేకొద్దీ విచక్షణాజ్ఞానం తగ్గిపోతోంది. శ్వాస తీవ్రమయ్యేకొద్దీ ఎదుటి వ్యక్తిమీద కోపం ఎక్కువ కాజొచ్చింది.

"నీకాక్కవలసింది నీ స్నేహితులతో హోటళ్లమ్మట తిరగడం, సినిమాలు షోకులు వెలిగించడం, అర్థరాత్రి వరకు పేకార్లు కొట్టడమేగాని యింట్లో వాళ్ళు ఎలా ఛస్తున్నారో ఒక్కనాడైనా చూసిన పాపాన పోయావా?"

ఈ నిందని అనవసరంగా స్నేహితుల మీద మోపడంతో కృష్ణ మరిక సహించలేకపోయాడు. సుందరమ్మ ఆగలేదు. ఇంకా ఆ విధంగానే నిందలు వేస్తూ పోతోంది. కృష్ణ ఉద్రేకం హద్దులు దాటిపోయింది. మంచం మీంచి ఛర్రున లేచి "నోర్ముయ్" అని తోసేశాడు.

సుందరమ్మ కొయ్యబారి పోయింది! ఏవీటి తను పెంచి పెద్ద చేసిన కొడుకు-కాదు కిరాతకుడు-అంత మాటని తోసెయ్యడం! ఇక అక్కడ ఒక్క క్షణం నిలవలేకపోయింది. ఆపుకోలేని దుఃఖంతో, అభిమానంతో గిర్రున తిరిగి లోపలికి వెళ్ళిపోయింది.

*    *    *

వారం...రెండు వారాలు గడచిపోయాయి. ఎడమొహం పెడమొహాలతోనే కాలం దొర్లిపోయింది. కొడుకును చూసిన తల్లి ఛీత్కారంతో తల తిప్పుకొని పోతూవుంటె, తల్లిని చూసిన కొడుకు సిగ్గుతో దహించుకపోయేవాడు. శాంత కనిపించినా పిలవడానికి గొంతుక పెగిలేదు కాదు. స్నానానికి నీళ్లు ఎవరు పెట్టేవారో, అన్నం ఎవరు వడ్డించేవారో కృష్ణకి గుర్తుండేది కాదు.

ఆఫీసుకి వెళ్ళేవాడు. అక్కడ బుర్ర సరిగా పని చెయ్యక తప్పులు చేసేవాడు. ఆఫీసరు పిలచి చీవాట్లు పెట్టేవాడు. మరిక దిక్కులేక, గతిలేక అవన్నీ సహిస్తూ ఆ ఆఫీసులోనే తలాంచేవాడు. ఇంటికి వచ్చేసరికి అరుగు మీది చెంబుతో నీళ్లు తన్ని హాస్యం చేసేవి. ఇంట్లోకి వెళ్ళినా అందరు ఎడమొహం పెడమొహాలతో తప్పించుక తిరిగేవాళ్ళే. ఇంట్లో వాళ్ళ ఈ చర్యలు కృష్ణని మరింత బాధించేవి. ఒక్కొక్కసారి బాధతో లోలోనే కృంగిపోయేవాడు. మరోప్పుడు యింట్లో వాళ్ళందరి మీదా చెప్పలేనంత కోపిష్టి అయిపోయేవాడు. ఆ ఉక్రోషంలో ఎదురుగా అగుపించే వస్తువుల్ని గుండపిండి చేసేసేవాడు.

ఆ వాళ శనివారం, సుందరమ్మ తులసిపూజలో వుండిపోయింది, శాంతకి వంట్లో బాగులేక పడుకొంది ఎవరికీ కృష్ణ ఆఫీసు మాట జ్ఞాపకం లేదు. తిండికోసం చూసి చూసి విసుగెత్తి కసిగా కాలికి తగిలిన పీటని తన్ని రంయ్యమని ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

ఆఫీసులో పని చెయ్యలేదు-యింటిదగ్గర కోపంతో. కడుపు కాలిపోతోంది. కళ్లు తిరుగుతున్నాయి. హోటలుకి పోవడానికి జేబీలో డబ్బులు లేవు. స్నేహితుల్ని అడగడానికి అభిమానం వెక్కిరించింది ఆ కసితో ఆ వాళ ఆఫీసు పని పిసరంతైనా ముట్టుకోలేదు.

సాయంకాలం ఆఫీసరు ముందు మళ్లా హాజరు కావలసి వచ్చింది. ఈ సారి చీవాట్లతో పాటు ఒక రిమార్కు గూడ పడింది. ఈ కోపం, లోపలి ఆకలి కోపంతో కృష్ణ నిలువెల్లా కంపించిపోయాడు. ఆవేశంతో యింటికొచ్చి మంచం మీద వాలిపోయాడు.

తనకిక శాంతి లేదు. విశ్రాంతి లేదు. జీవితానికి కాంతి లేదు. బ్రతుకే భ్రాంతి ఐపోయింది. అక్కడ ఆఫీసు, ఇక్కడ రుసరుసలాడే తల్లి, ముఖం తప్పించుకొనే భార్య గృహంలో స్వర్గాన్ని ఆశించాలనుకొంటాడు, ఉన్న చిన్న వస్తువులతోనే తృప్తి పొందాలనుకొంటాడు. కాని చుట్టూరా వున్న పరిస్థితులు విడిపిస్తున్నాయి. విడిపించి చంపుతున్నాయి.

ఇంతలో పక్కన శాంత పాడి దగ్గు వినిపించింది. చూడెగూడదు చూడెగూడదనుకొంటూనే కృష్ణ పక్కకి చూశాడు. హఠాత్తుగా దృష్టి శాంత కళ్లల్లోకి ప్రసరించింది.

శాంత తల దింపుకొంది.

"మీరు...మీరు ప్రొద్దుట భోంచెయ్యకండా వెళ్ళిపోయారు?"

నీరసంగా వచ్చిన శాంత మాటలు, కృష్ణ కడుపాకలి మహాకోపాన్ని తెప్పించింది.

"పెట్టే దిక్కుంటేగా?"

శాంత మరిక మాటాడలేక పోయింది కాసేపటివరకు. ఆ ఉద్రేక సమాధానానికి కాస్త భయపడింది గూడ. తర్వాత ఒక నిట్టూర్పు విడిచి మెల్లగా అంది:

"నాన్న దగ్గరనించి మని ఆర్డరు వచ్చింది"

కృష్ణ కటువుగా శాంత వేపు చూశాడు.

"ఇంటో చాల యిబ్బందిగా వుంది. ఇవి తీసుకోండి..." అని చేతిలోని పది రూపాయల నోటుని కృష్ణ పక్కనే పెట్టి వెనక్కి తిరిగింది.

కాగితం కేసి చూశాడు కృష్ణ ఎక్కడలేని ఆత్మాభిమానం, ఉక్రోషం పుట్టుకొచ్చాయి. పది రూపాయల కాగితం! తన నాన్న పంచినవి-తను, ఆడదాని చేతినించి




తీసుకోవడం! కాదు అమె తన్నొక చేత కాని వాడిలా, భావించి ధర్మంగా యివ్వడం!

"అక్కర్లేదు" నోటుని వళ్ళిపోతున్న శాంత మీదికి విసిరేశాడు.

శాంత అగి కిందపడ్డ నోటుని తీసింది. కాని తిరిగి భర్తకి యివ్వడానికి సాహసించ లేక పోయింది. కాసేపలానే నిలబడి తర్వాత ఏమనుకొందో అతని దగ్గరగా వస్తూ ప్రేమగా అంది.

"మీరు రోజురోజుకి నీరసించి పోతు న్నారు. జీతం యింకా ఏ వారానికో గాని అందదు. అంతవరకూ యింట్లో భత్యానికి యిప్పుడున్న సామాన్లు చాలవు. అందు వల్ల యివి తీసుకొని బజారు చెయ్యండి.

కృష్ణ సమాధానం చెప్పలేదు.

"నాన్న యీ డబ్బు నాకే పంపిస్తున్నా మీరు నా వారైనపుడు దాన్ని మీకు యివ్వడంలో తప్పలేదు. ఆ యిచ్చే హక్కు గూడ నాకుంది"

"హక్కంటె నీకోసం నువ్వే ఉపయో గించుకో"

"వద్దు"

"వద్దుగాకపోతే చావు" గభుక్కున లేచి బయటికి తోసేశాడు.

అదే మొదలు శాంత మంచం పట్టింది. ఐనా తన నిస్సత్తువని మాత్రం ఒక్కసా రైనా అత్త మామలకి తెలియనివ్వలేదు సుందరమ్మయితే కొడుకుతో మాటాడ్డం పూర్తిగా మానేసింది. తండ్రి, శేషాద్రి యింట్లో పరిస్థితుల్ని అంతగా పట్టించు కొనేవాడు కాడు. కాని ఆ తటస్థ విధానా నికి గూడ ఓ నాడు భంగం కలిగింది. సుంద రమ్మ దగ్గరనించి సంగతంతా విని కొడుకు దగ్గరకొచ్చి

"అంత చేతకానివాడివి పెళ్లెందుకు చేసుకున్నావ్?" అన్నాడు.

"బండరాయిని తగిలించింది కాకుండా తిరిగి నా మీదే నింద వే..."

కృష్ణ మాటలు నోట్లో వుండగానే ముస లాయన కోపంగా అరచాడు.

"నోర్మూయ్... బయట పరిస్థితుల్ని ఎదుర్కోలేక యింట్లో చేతగాని ఆడంగుల మీదరా నీ అధికారం, కసి? ఇంట్లో వాళ్ళంతా నీ కాళ్ల కింద వున్నారని నీ యిష్టమొచ్చినట్టు ఏడిపిస్తావట్రా? అంత షోకులు చేసేవాడివి మరో విధాన డబ్బు గడించుకోలేక పోయావా?"

ఇంతలో సుందరమ్మ వచ్చింది. వస్తూనే నోరు విప్పింది.

"రేపొద్దుట అది చచ్చిందంటే ఆనింద ఎవరికో..."

"నాకే...నాకే...నాకే... ముమ్మాటికీ నాకే...ఆ కారకుణ్ణి నేనే అవుతాను. మీ కెందుకా బాధ పోండి" అంటూ వాళ్ళి ద్దర్నీ గెంటి తలుపులు బిగించుకొన్నాడు.

ఈగొడవంతా శాంతకి వినిపిస్తూనే వుంది. బాధగా ఒక నిట్టూర్పు విడచింది. ఇక్కడ తను యిలాంటి కష్టాలు పడు తున్నట్టు గాని, కనీసం తన ఆరోగ్యం గురించి గాని తలిదండ్రులకి తెలీపరచడం లేదు. ఎప్పుడైనా నాన్నకి ఉత్తరం వ్రాయాలని బుద్ధి పుడితే కార్డు తీసి అస్ప ష్టంగా నాలుగు ముక్కలు వ్రాసి పోస్ట్‌లో వేసేది.

కాంతా రావుగారు కూతురు ఉత్తరాలని చూసి మొదట్లో అంత ఆశ్చర్యపడక పోయినా తర్వాత ఈ రాసే రెండు వాక్యాలకి అంతరార్థం ఏవిటా అని ఆలో చించ సాగాడు. చివరికి ఏమనుకొన్నారో అల్లుడుకి తన అభిప్రాయాలన్నీ వివరిస్తూ ఉత్తరం రాశారు.

కృష్ణ అజాగ్రత్త వల్ల ఆఫీసులో అందరి కంటె సోమరిగా ఆఫీసర్ల దృష్టికి పడ్డాడు. రెండో వార్నింగ్ గూడ దొరికింది. దీనికి జడిసి, కృష్ణ తన ఓర్మనంతనీ ఉపయో గిస్తూ అడకువగా పని చేస్తున్నాడు. ఆ సమయంలో ఈ ఉత్తరం అందింది. చదువు కొని జోబీలో పెట్టుకొన్నాడు.

సాయం కాలం యింటికి వచ్చీరాగానే అరుపులు ప్రారంభించాడు. అందుకు తోడు శాంత సరిగా ఎదురు పడింది. అగ్గి మీద గుగ్గిలం పడ్డంత పనైంది. ఊర్థ్వ స్వరంతో అరిచాడు: "చావక ముందే ఛస్తున్నానని పుట్టింటికి రాసుకొంటె, ఆ నాన్న గారు సంజీవిని తెస్తార్లాగుంది!"

శాంత కీ పోలికేకలు అర్థం కాకపోయినా కొంతవరకు వూహించ గలిగింది.

ఇంతలో తండ్రి లోపలినించి వచ్చాడు "మళ్లా ఏం కొంప మునిగి పోయింది?" అనుకుంటూ.

కృష్ణకి ఈ సమయంలో యుక్తా యుక్తాలు తెలీడం లేదు. కసి, కోపంతో నిలువల్లా వణికి పోతున్నాడు. "ఇది మీ కనవసరం"

"ఏమన్నావ్——?"

"ముమ్మాటికీ మీకొక్కడు"

"మాకక్కర్లేదూ! రేపొద్దుట నీ తాత అక్కణ్ణించి వచ్చి చచ్చిన దానిగురించి అడిగితే చెప్పే బాధ్యతెవరు? అక్క ణ్ణించి తీసుకొచ్చి తిండి పెట్టకండా చంపారనే 'మంచిపేరు' ఎవరికొస్తుంది?"

"నాకే వస్తుంది. మరి మీరిక మాటాడ కండా బయటకి పోండి, మాట దక్కదు"

"మాట దక్కకపోతే ఏం చేస్తావురా?" వెళ్లాడు. తండ్రికొడుకులిద్దరూ ఆవేశాలతో చూసుకున్నారు. కేకలు అరుపులు వీధిలో మారుమోగాయి. ఇరుగు పొరుగుల వాళ్ళం తా పరుగు పరుగున వచ్చి తండ్రి కొడు కుల్ని మంచి మాటలతో సముదా యిం చారు.

కృష్ణ యింట్లోకి వెళ్ళి ధఢీమని తలుపు వేసుకొన్నాడు.

"ఇక యిక్కడ మేం ఒక్క క్షణం వుండలేం. మరో రెండు రోజులుంటే ఖూనీ గూడా చేసేస్తాడు ... ఇంటి కొస్తాడు కంయ్, బొంయ్ మంటాడు — వీమని అడిగితే లెంప కాయల్తో సమాధానం చెబుతాడు ... ఇక మేం వుండలేం బాబూ..." అంటూ సుందరమ్మ గుడ్లు నీళ్లు తిప్పకొంది.

ఈ కలహాపర్యవసానంగా సుందరమ్మ శేషాద్రులు కొడుకుయిల్లువిడిచి సుంద రమ్మ తమ్ముడింటికి వెళ్ళిపోయారు. శాంత ఎంతో ఆటంకపరచింది; బ్రతిమాలింది. ఇక తనకి మిగిలింది ఆ చేతగాని ఏడు పొక్కటే. (ఇంకావుంది)


# నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది. మేహ ము, నికొక్క, నిస్సత్తువ శుక్ల నష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలి గించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 12 అ.

పి. సి ఏ. & కంపెని. "ఆయుర్వేదసమాజం" పెరిదేపి- నెల్లూరు జిల్లా.

ఒక గంటలో యీావ్వనము

# కామ స్తంభన

ధాతుపుష్టి. సంసారసుఖము విచ్చుటలో సాటిలేనిది. విరాశచెందిన వృద్ధులయందు శక్తి, ఉత్సాహము విచ్చును రు. 2-8-0

మదన మంజరి ఫార్మసీ

184, చైనా బజారురోడ్డు, మద్రాసు

బెజవాడ-శ్రీనివాస మెడికల్ హాల్ ఏలూరు రోడ్డు, రాజమండ్రి—ఈశ్వరదాస్ & కో. మెయిన్ రోడ్డు. నెల్లూరు అర్యన్ ఫార్మసీ.

# కాశ్మీర్

అన్నిదగ్గులకు అమోఘమైనది

గిరిజా & కో., రాజమండ్రి

# అగుపించని అంకుశాలు

(గతసంచిక తరువాయి)

మర్నాడు గూడా కృష్ణ తన ప్రవర్తన ఎంత నీచాతి నీచమైందో గుర్తించలేక పోయాడు. అసలు ఆ అభిప్రాయాన్నే మనస్సునించి ఉద్దేశ్య పూర్వకంగా దూరం చేసేసుకొన్నాడు. ప్రొద్దుట లేచీ లేవగానే శాంతవేపైనా చూడకండా ఆఫీసుకి వెళ్ళిపోయాడు. ఆ ఆఫీసు వాతావరణం మనిషిని మరింత వెక్కిరించింది. ముక్కూ ముఖం తెలియని మేనేజరు జారీచేసే ఆర్డర్లని శిరసా వహించడం తన చేతగాని ఆత్మాభిమానాన్ని మరింత గాయపరిచాయి.

ఇటు శాంత ప్రొద్దుట కృష్ణకంటె ముందే లేచింది. వంట్లో ఎంత నీరసంగా వున్నప్పటికీ పొయ్యిరాజేసి వంటకాలు సిద్ధం చేసింది. కాని గదిలో కృష్ణ లేడు. కళ్లలో నీళ్లు గిరగిరా తిరిగిపోయాయి. ద్వారాని కానుకొని చేతుల్లో ముఖం దాచుకొని ఏడ్చింది. ఏమిటి ఆయన చర్యల కర్థం ? తనని ఎందుకిలా కాల్చుకు తినడం ? భగవంతుడు తనని తీసుకపోడేం ?...ఏడ్చేడ్చి తనూ భోంచెయ్యకండా మంచంమీద నిద్రపోయింది...

వాకిట్లో చెప్పుల చప్పుడు వినిపించేసరికి మెలుకువ వచ్చింది. ఛప్పున వెళ్ళి తలుపు తీసింది. బయటకి చూసి ఆశ్చర్యపోయింది: తనకి తెలీకండానే సాయంకాలం, రాత్రిగూడ ఐపోయాయి! ఆయన గూడ ఎప్పుడూ లేంది చాలా ఆలస్యంగా వచ్చాడు! లోపలికి దూకుడుగా వచ్చి మంచం మీద కూల బడ్డాడు కృష్ణ.

"స్నానం చెయ్యరూ ?"

కృష్ణ పలకలేదు. మరి అతన్ని మాటాడించడానికి శాంతకి ధైర్యం లేకపోయింది. ఒక నిట్టూర్పు విడిచి వెనక్కి తిరిగింది. కాని అడుగులు ముందుకు సాగలేదు.

ఇలాగే ఈ సమయంలో ఆయన యింటికి తిరిగి వచ్చేసరికి ఏదో ఒక గొడవ ఏదో ఒక గోల్లు తయారుగా వుండేది. ఆఫీసులో మతిపోగొట్టుకొని యింటికి వచ్చే మనిషికి సుఖమనేది మృగ్యమయ్యేది. శాంతి వుండేది కాదు. విశ్రాంతి చిక్కేది కాదు. ఆ పరిస్థితుల్లో తనుగూడ ఎందుకో ఆయన్నే వేధించుకతినేది. తనకి అత్తమామలు అండగా నిలచేవారు ... వాళ్ళు జ్ఞాపకానికి వచ్చేసరికి శాంతమనస్సంతా అదోలా మారిపోయింది. భవిష్యత్తుమీద ఎందుకో విపరీతమైన భయం పుట్టింది. వాళ్ళు లేంది తను ఒంటరిగా ఈ సంసారాన్ని నడిపించడం...గుండె కొట్టుకో సాగింది. శరీరం కంపించింది. ఆ స్థితిలో ఆమెకి ప్రతీ అంశం అంధకారంగానే కనిపించింది. చప్పున తిరిగి అతని వెనక్కి వచ్చి—

"మీరు అత్తయ్యని తిరిగి..."

మాటలు నోట్లో వుండగానే ఛర్రున లేచాడు కృష్ణ. "ఎందుకు?"

ఆమాటల దూకుడులో ఒక దుర్వాసన ముఖం మీదికి గప్పున వచ్చింది. శాంతి కిది భరించరానట్టయింది. ఊపిరి స్తంభించిపోయినట్టయింది. ఈవాళ జీతాలు అందుతాయన్నట్టు తర్వాత గుర్తుకొచ్చింది. ఐతే ఇప్పుడిది ఈ అభ్యాసంలోకి... ?

"ఈవాళ జీతాలు అందాయి కదూ ?" ధైర్యాన్నంతనీ కూడ బెట్టుకొని అడిగింది.

**శ్రీ యస్. ఆర్. నంది**

"నీ కెందుకు జీతంతో పని ? పోయిక్కణ్ణుంచి..." అంటూ పీక పట్టుకొని తోసేశాడు.

మారిపోతున్నాడు కృష్ణ. జీవితంలో తనని ఎవరూ ముందుగా హెచ్చరించని సమస్యలతో యుద్ధంచేయ నారంభించాడు. కనిపించే శత్రుల్ని దూరంచేసుకో గలిగానసు కొంటూనే, కనిపించని కత్తుల నిలువు కోతలకి బాధపడిపోతున్నాడు. ఏడుస్తాడు-ఎలుగెత్తి-ప్రపంచాన్ని విమర్శించు కొంటూ, తిట్టుకొంటూ; చేతగాక చివరికి వాటిమీద పడి ఏడుస్తాడు. మనస్సులో నిత్యసంఘర్షణ! ఫలితాలకి తల వొంచవలసి వచ్చింది - అప్రయత్నంగా. తల వొంచాడు. వొంచినకొద్దీ వ్యక్తిత్వం, మానవత్వం నశించ మొదలుపెట్టాయి. చివరికి మనిషిలో కేవలం పశుత్వమే మిగిలిపోయింది.

ఇంట్లో అర్ధాంగికి డబ్బివ్వడు. భోంచెయ్యడు. సరిగా యింటిపట్టున వుండడు. చుట్టూ పరిహాసాలతో ఫక్కు ఫక్కున నవ్వే ప్రపంచం నించి తప్పించుకోడానికి తన యింటికంటె ఆరు బయటే ఎక్కువ శాంతినిస్తుంది అనుకునేవాడు. తిరిగేవాడు వూరంతా పిచ్చివాడిలా. కాని ఆ ప్రపంచంలో శాంతి అనేది కనిపించలేదు. విశ్రాంతి అనేది వినిపించలేదు. నిరంతర సంఘర్షణల మధ్యనించి తప్పించుకొని తాత్కాలిక కృత్రిమసౌఖ్యాన్ని పొందడానికి మద్యపానమే శరణ్యమైంది.

భర్త పరిస్థితి శాంతని మరింత భయపెట్టింది. ఈ దిగులుతో పచ్చి మంచినీరైనా ముట్టడంలేదు. ఆలోచనలతో నిండిపోయిన మనస్సులో తన పుట్టింటిమాటే జ్ఞాపకం వుండేది కాదు. ఈ పిల్ల పరిస్థితికి యిరుగు పొరుగుల వాళ్లు భయపడ్డారు. తరచువచ్చి ఓరడించడానికి ప్రయత్నించేవారు కాని ఓరట పొందడం మాత్రం వుండేది కాదు. ఈ మనోవ్యథతో మనిషి పూర్తిగా చిక్కి శల్యమైపోయింది.

పెళ్ళయి అత్తవారింటికి వచ్చేటప్పుడు చిన్నతమ్ముడు ఏడుస్తూ తనని గట్టిగా పట్టుకొని 'ఎప్పుడు తిరిగొస్తావక్కాయ్' అన్నప్పుడు తను చెప్పిన సమాధానం ప్రతీ పండక్కీ అని. కాని తనకి తిరిగి తల్లిని, తండ్రిని, తమ్ముణ్ణి చూసే అదృష్టమంటూ వుంటుందా ? వాళ్ళందరు జ్ఞాపకానికి వచ్చేసరికి ఎక్కడలేని ఏడుపూ ముంచుకొచ్చేసింది. ఏమనుకొందో కాకినాడకి చిన్న ఉత్తరం వ్రాసింది.

"నాన్నా,

ఒక్కసారి అమ్మని, చిన్నతమ్ముణ్ణి తీసుకొనిరండి—నాకు చూడాలని వుంది— శాంత"

ఇంతే వ్రాయగలిగింది.

ఆ మూడవనాడు శాంతకి జ్వరం వచ్చింది. ఐనా మొండికెత్తి లేచి పొయ్యిరాజేసి ఆఫీసుకి వెళ్ళే భర్తకోసం అన్నం


చదవండి / తెనుగు మాస పత్రిక
**జయభారత్**
ఎడిటర్: ...
... హైదరాబాదు-దక్కను

వండింది. కాని కృష్ణ భోంచెయ్యకండానే వెళ్లిపోయాడు.

శాంత కళ్ళనీళ్లు తిప్పుకొంది. అంత కంటె చేతనైన కార్యం మరొకటి తనకి తెలీదు. ఓపిక వున్నంతవరకు, లోపల బాధ తొక్కలికంగా ఉపశమించేవరకూ పరుపుమీద పడి కుమిలి కుమిలి ఏడ్చింది. దయ అనేది కన్నీటికి కలిగినట్టుంది-మరిక కళ్ళల్లో అవి కనిపించలేదు.

మధ్యాహ్నం వన్నెండవుతుందనగా వాకిట్లో శబ్దం వినిపించింది. అలవాటైన శబ్దమే గాబట్టి ఎదురు చూడకండా, అన్నం వడ్డించడానికి వంటింట్లోకి వెళ్లింది. ఇంతలో వెనక వింతైన శబ్దం వినిపించింది. కంగారుగా తలతిప్పి వెనక్కి చూసింది. తన కళ్ళని తానే నమ్మలేక పోయింది! నిజంగా, నిజంగా యిది సంభవమా! కల కాదుకదా! పెదవుల్లో చిరునవ్వు నృత్యం చేసింది. పరవశంతో కళ్లు చెమ్మగిల్లినై! ఛప్పున వచ్చి 'అమ్మా' అంటూ ఎదుట వ్యక్తిని కౌగిలించుకొంది.

ఎదుటివ్యక్తి చేతులు అప్రయత్నంగా బిగిసాయి. తల్లీ కూతుర్ల హృదయాల్లో మమతలు విజృంభించాయి. ఈ స్థితినించి మొట్టమొదట జానకమ్మే తేరుకొంది. కూతురు ముఖాన్ని పరీక్షగా చూసింది.

ఇంత నీరసించిపోయిందేం శాంత! పోషణ సరిగా లేదా? అత్తమామల సాధింపా? అబ్బే వాళ్ళలాంటివారు కారే! మరి? కృష్ణ ఏమన్నా అంటుం టాడా? ఏ ప్రశ్న ఎలా వేసుకొని ఏ విధంగా సమాధానం చెప్పుకోవాలో అర్థం కాలేదు. అప్పటికప్పుడు కూతుర్ని ఏమీ అడగలేదు. భోజనాలైన తర్వాత మంచం మీద కూచొని తమ్ముడుతో కథలు చెప్పు కొంటున్న శాంతతో అంది:

"చాలా తీసిపోయావమ్మా?"

శాంత చిరునవ్వు నవ్వి తన శరీరాన్ని పరీక్షగా చూసుకొంటూ: "తీసిపోయానా! అరె! నామటుకి నేను బాగా బలిశాననుకొంటున్నాను సుమా" అంది అదేనవ్వుతో.

కాని యిందులో ఎంత సత్యముందో జానకమ్మ త్వరలోనే కనిపెట్ట గలిగింది. శాంత మధ్యాహ్నం నిద్రపోయిన తర్వాత యిరుగు పొరుగుల వాళ్ళంతా కృష్ణ ప్రవర్తన గురించి చెప్పారు. రోజూ తాగొచ్చి ఆ పిల్లని నానా హింసలు పెడుతుంటాడు, యింట్లో ఒక్క దమ్మిడీ ఐనా యివ్వడని తమ అక్కసుని వెళ్ళబుచ్చారు.

ఇవన్నీ విని మొదట జానకమ్మ నమ్మలేక పోయింది. కాని యింతమంది ఏక కంఠంతో అతనిమీద చెప్పడానికి వాళ్లకి అతనిమీద ఏమైనా పగా? అని ఆలోచిం చేసరికి యివన్నీ నిజాలుగానే తోచాయి.

ఇందుకు ప్రత్యక్ష నిదర్శనంగా సుంద రమ్మ, శేషాద్రులు యిల్లు విడిచిపోవడం. జానకమ్మకి కళ్లనీళ్లు తిరిగాయి. పడుకున్న కూతుర్ని పరీక్షగా చూసింది. నీరసించి పోయిన శరీరంమీద అస్పష్టమైన దద్దుర్లు, మెడమీద చేతులమీద గాయాలు, లోతుకు పోయినకళ్ళు-తన కూతురుకి ఎంత గతొచ్చింది; ఇంత యమయాతనలు పడుతూ గూడ యిలా అని ఒక్కసారీ రాయలేదేం? అంత అమాయకంగా ఎలా బ్రతుకుతోంది!

తలుపు ఎవరో తట్టారు. శాంత తుల్లుపడి లేచింది. భయంతో తల్లిని గట్టిగా పట్టుకొంది. గజగజలాడిపోతోంది. కూతురి ప్రవర్తన అర్థంగాక జానకమ్మ-

"ఏమిటి-ఏమిటమ్మా యిలా వొణికి పోతున్నావ్?" అంది కంగారుగా.

"ఆ...ఆ...యన...వచ్చా... రమ్మా" శాంత మాటలు నూతిలోంచి వచ్చినట్టు వినిపించాయి.

జానకమ్మ వెళ్లి తలుపు తీసింది.

తూలుతూ కృష్ణ లోపలికి వచ్చాడు.

"వాడు...మా ఆఫీసరు...వెధవ...ఈ ఆఫీసరు వెధవలంతా అంతే... సందు దొరికితే...రిమార్కు... ఏదో... తప్పొచ్చిందని వెధవ... డిస్మిస్ చేసేశాడు...నన్నే ...కృష్ణని...చూస్కో ఈవాళ...వాణ్ణి ...ఖూనీ చేసిగానీ...నిద్రపోను..."

జానకమ్మకి గుండె దడపుట్టింది.

కృష్ణ జానకమ్మని చూడలేదు గబగబ శాంత దగ్గరకి వచ్చాడు. చెయ్యి చేసుకొం టాడనే భయంకొద్దీ జానకమ్మ అతని కడ్డంగా వచ్చింది. కృష్ణ మనుష్యుల్ని అనవాలు పట్టేస్థితిలో లేడు. జానకమ్మని తల్లి అనుకొన్నాడు.

"మళ్లా...వొచ్చావ్...ఎందుకు... ఇదేనా రక్షిస్తా?..." అని శాంతకేసి చెయ్యి వూపుతూ "ఏయ్...ఇలారా... రా యిలా"

ఇంకా శాంత కదలకపోవడంతో తూలుతూ ఆమె మీదికి రాపోయాడు. జానకమ్మ భయంతో అతని ఎదురుగా వచ్చింది.

"ఏమిటీ వేషాలు? ఎవరనుకొంటున్నావ్-సరిగ్గా కళ్లుపెట్టి చూడు"

"చూసే...దేమిటి-అడ్డు తప్పుకో" అంటూ కృష్ణ జానకమ్మని తోసేశాడు.

శాంత జడిసి తల్లిని ఎత్తబోయింది. కాని కృష్ణ ఆమె జడ పట్టుకొని ముఖంమీద శక్తికొద్దీ కొట్టాడు. శాంతగూడ ఆ పక్కకి ఒరిగిపోయింది. ఉక్రోషంతో తిరిగి శాంతని కొట్టాలని ముందుకు వంగడం, తలమీద పెద్ద దెబ్బ ఆగస్మాత్తుగా పడడం, దాన్ని తట్టుకోలేక అంత నిషాలోను 'అమ్మా' అని కిందపడి పోవడం ఒక్కసారిగా జరిగాయి.

బెగిలిపోయి భయంతో పాలికేకలు పెట్టేస్తున్న రాము కృష్ణని తలమీద కొట్టిన వ్యక్తిని చూసి "నాన్నా" అంటూ అతని నడుముని గట్టిగా చుట్టేశాడు.

ఈ కేకలు విని యిరుగు పొరుగుల వాళ్లంతా గుమిగూడిపోయారు. తలో విధంగానూ కృష్ణని ఆడిపోసుకొంటు

(22-వ పేజీ చూడండి)



# అగుపించని అంకుశాలు

(15-వ పేజీ తరువాయి)

న్నారు. 'ఎంతయినా యిదా మనిషి చేసే పాడు చెయ్యడం? కట్టుకొన్న పెళ్లాన్ని, రోజూ తాగొచ్చి పులుసులోకి దుమ్ములేకుండా బాదుతాడా? ఛీ!' అంటూ తిట్టారు గూడా.

సమయానికి కాంతారావుగారు గాని రాకపోయినట్టయితే ఏమయ్యేదో! కూతురు రాసిన ఉత్తరాన్ని చూసుకొని ఆయన భార్యని పంపించారు. తను సెలవుదొరక్క విధిగా వుండిపోవలసి వచ్చింది. కాని వాళ్ళనిలా బండెక్కించి యింటికి వచ్చేసరికి కృష్ణ పొరుగింటి పెద్దమనిషా కాయన ఇక్కడ పరిస్థితుల నన్నిటినీ వివరంగా ఉత్తరం రాసి 'మీరు గాని త్వరగా మేల్కొనకపోతే మీ పిల్ల మీకు దక్కదు' అని హెచ్చరించారు. ఆ ఉత్తరం తీరు కాంతారావుగారికి అర్థం కాలేదు. చదివిందే మూడు నాలుగు సార్లు చదువుకొన్నారు. చివరికి ఏమనుకొన్నారో అప్పటికప్పుడు స్కూల్‌కి వెళ్ళి శలవు తీసుకొని మధ్యాహ్నం బండిలో బయలుదేరి వచ్చేశారు.

ఇక్కడికి వచ్చేసరికి యిదీ పరిస్థితి!

కృష్ణ ఈ విధంగా తయారవుతాడని కలలోనైనా వూహించలేదు. తల్లిదండ్రుల మీద గూడ చెయ్యి చేసుకొని వాళ్ళని యింటినుంచి వెళ్ళగొట్టినవాడు, యికమీదనైనా కళ్లువిప్పి తన కూతుర్ని సుఖపెడతాడనే నమ్మిక తనకెలా కలుగుతుంది? కూతురు వేపు చూశాడు. ఆ అమాయక ముఖాన్ని చూస్తుంటె అంత జాలివేస్తుందే, వెధవకి చేతికొచ్చినట్టు చావు దెబ్బలు కొట్టడానికి చేతులెలా వస్తున్నాయో. ఇక శాంతని అక్కడే ఆ నరకంలో వొదిలేస్తే తనకి దక్కదనుకొన్నారు. తనతోబాటు కూతుర్ని తీసుకపోతే వెధవకి ప్రపంచంలో బ్రతకడమంటె ఏవిటో అర్థమై చచ్చినట్టు కాళ్లదగ్గరికొస్తాడు.

ఆ స్థితిలో ఆయనకి యుక్తాయుక్తాలు తెలియలేదు. కూతుర్ని వెంట బెట్టుకొని తిరుగు బండిలో కాకినాడ వచ్చేశారు.

శాంత కాకినాడ వచ్చిన రెండు రోజులకి గాని జ్వరం తగ్గలేదు. కాస్త తేరుకొని యిటూ అటూ చూసేసరికి ఆ వాతావరణమంతా కొత్తగా వున్నట్టు కనిపించింది. ఆ వచ్చేగాలి కృష్ణ మీదది కాదు-ప్రశాంత సముద్రంమీదనించి! ఈమార్పునే తను కోరుకొంది. ఈ మార్పుకోసమే అంత చిన్న ఉత్తరం తండ్రికి అస్పష్టంగా రాసింది. తిరిగి ఈ సౌఖ్యాన్ని పొందాలనే కాంక్షతో నే వ్యంగ్యార్థాన్ని ఆ చిన్న వాక్యంలో సృష్టించింది.

లేచి పరుపు మీద కూచొంది. గోడల మీది బొమ్మలు, ఇంట్లో కుర్చీలు బల్లలు, తన చేత్తో చిన్నతనంలో అల్లిన అల్లికలు, యిరుగు పొరుగుల వాళ్ళ మాటలు-అన్నీ తిరిగి తనని ఐదేళ్ల వెనక్కి తీసుకపోతున్నాయి. చంపలకి చేతులు ఆన్చుకొని వాటిల్లోగల సామాన్య సౌందర్యాన్ని వూహించుకొంటూ పరవశమైపోతోంది.

మర్నాడు శాంత లేచి తిరగగలిగింది. ఎప్పుడూ లేని ఉత్సాహం ఆమెలో వెల్లివిరిసింది. జీవితమంతా ఎప్పుడూ యింత హాయిగా వుంటె విరక్తి అనేది మనుషులకి ఎందుకు పుడుతుంది? ఇలాంటి ఆనందాన్ని తను ఎప్పుడు అనుభవించగలిగింది? జీవితంలో కొన్ని దినాలే అలాంటివి రుచి చూడగలిగింది. పెళ్లయిన కొత్తలో, ఆయన్ని చూస్తూ కూచున్నపుడు, ఆయన తనతో మాటాడుతున్నపుడు హాస్యానికి తనని ఏడిపించేటప్పుడు మొదటి పిల్లాడు పుట్టినప్పుడు, వాడిని ముద్దాడుతున్నపుడు వాడి నత్తి మాటల్ని వింటున్నపుడు. కాని వాడు పోయాడు-అప్పటినించి యింత వరకు తను అలాంటి ఆనందాన్ని అనుభవించలేదు. అప్పటి తన జీవితం జ్ఞాపకానికి వచ్చినపుడు శరీరం ఒక్కసారిగా జలదరించింది.

సాయంకాలం డాబామీద కూచొని రాముతో మాటాడుతోంది. ఆ మాటల్లో తనకి తెలీకండానే ఒక విషయం గురించి పదేపదే ప్రస్తావించ మొదలు పెట్టింది. ఏ వ్యక్తినైతే యింత వరకూ అత్త మామలు, తన తల్లిదండ్రులు, ఇరుగు పొరుగు వాళ్ళు, ప్రజలు చివరికి తను గూడ అసహ్యించుకొంటూ వున్నారో ఆ వ్యక్తే తనకి తెలీకండా తన మనస్సులో ప్రవేశించి తనని ఎందుకో పురికొల్పుతున్నాడు.

"బావ మంచివాడేనా రామూ?" అంది అప్రయత్నంగా. అన్న తర్వాత శరీరం ఒక్కసారిగా గగుర్పొడిచి చల్లబడిపోయింది.

"ఊహుఁ. బావ తాగుబోతు." అన్నాడు రాము ఆ నాటి సంఘటనని జ్ఞప్తికి తెచ్చుకొంటూ.

శాంత కంపించింది. తమ్ముడు కేసి చూసింది. వాడికేం తెలుసు బావ మంచివాడో కాదో! ఆ వాళ తాగొచ్చి యిల్లుని నానా పాడూ చేయడం వల్లే వాడి పసి హృదయంలో 'బావ తాగుబోతు. మంచి వాడు కాడు' అనే అభిప్రాయం ఏర్పడిపోయింది. పసివాడు వీడే అలా అంటున్నపుడు ప్రజలు ఆయన్ని దూషించడంలో తప్పేముంది?

కాని శాంతకి ఎందుకో భయం కలిగింది. ప్రజలంతా ఏకమై తన భర్తని ఆడిపోసుకొంటున్నట్టు, తాగుబోతని తమ మధ్యకి చేరనివ్వకండా దూరంగా గెంటినట్టు, దిక్కులేక అతను ఈ పంచా ఆ పంచా పట్టుకొని తిరుగుతున్నట్టు కళ్లముందు కనిపించింది. కెవ్వున కేక వేసింది. కాని అది గొంతుక కిందే అణగారిపోయింది. అవును అన్నీ తెలిసి, అతని కష్టసుఖాలు పంచుకొనే తనే ఈవిధంగా విడిచివచ్చేస్తే యిక ఆయన్ని ఆదరించే దయామయులెవరుంటారు? ఎవరు చేరదీస్తారు? ఎవరు స్నానానికి నీళ్లు పెడతారు? ఎవరు ఆప్యాయంగా పిలచి భోజనం పెడతారు? ఎవరు పక్కలు వేస్తారు? తను యింత కఠినాత్మురాలేం! తనలో మాతృహృదయం, మాతృమమత చచ్చిపోయిందా? తన భర్తని తను చేజేతులా హింసిస్తూ-ఛీ! యింకా తను ఆ భార్యాస్థానానికి అర్హురాలా? భర్తలేని తన జీవితం ఎంత పుట్టిల్లైతే మాత్రం సుఖంగా వుంటుందా?...

అంత్యస్థితి సమీపించింది. కళ్లనించి నీళ్లు కిందికి ఝల్లు రాలే సమయం-కాని వీధిలో కారు హారన్ వినిపించి అగస్మాత్తుగా లేచి కిందికి చూసింది.

కారులోంచి దిగిన వ్యక్తిని ఆనవాలు కట్టింది. రమణరావు! ఎందుకొచ్చినట్టు? తన భర్త గురించి ఏమైనా చెప్తాడా? ఎక్కడనించి వచ్చాడు?...గబగబ కిందికి దిగింది.

కారు దిగి లోపలికి వచ్చిన రమణరావు పేపరు చదువుతున్న కాంతారావుకి నమస్కారం చేశాడు. కాంతారావుగారు పేపరుదించి ఆ మనిషిని పరీక్షగా చూసి:

"ఎవరు?...అర్...నువ్వా రమణరావ్. రారా..ఇలా కూచో" అంటూ కుర్చీ చూపించి:


## నపుంసకతైలం

అంగ నరములు బలహీనత చెందిచిన్నదైన, తిర్గి యథాప్రకారమై పూర్తి సౌఖ్య మనుభవించుటకు 45 యేండ్ల ప్రఖ్యాతి చెందినది.

1 సీసా రూ. 10/ కర్చార్జ్ వి.పి. రూ 1-0-0.

ఆర్డరుతో రు 1/- పంపవలెను.

డా॥ రత్నం సన్స్ మెడికల్ హాల్
మలక్‌పేట బిల్డింగ్స్,
హైదరాబాద్, దక్కన్.

"ఏమిటి విశేషాలు? చాలా మారిపోయావ్! యిప్పుడేం చేస్తున్నట్టు?" అన్నారు.

ప్రస్తుతానికి ఒక చిన్న మిల్లు నడిపిస్తున్నానులెండి..." ఈ సమాధానం యిక ముందుకు చెప్పడానికి మనస్కరించలేదు. ఐనా మాష్టరుగారుకదా తన మిల్లు గురించి టూకీగా చెప్పాడు.

అంతా విని "ఐతే యిప్పుడు ఎక్కడనించి రావడం?" అన్నారు కాంతారావుగారు.

"విజయవాడ మన కృష్ణ దగ్గర నించే వస్తున్నాను లెండి"

"కృష్ణ ఎవరు?"

"మీ అల్లుడు, నాకు స్నేహితుడూను. వాడి మనస్తత్వం మీ కంటె నాకు బాగా తెలుసు. మీరు మొన్న విజయవాడ వచ్చినట్టు తెలిసింది. నేను ఈ పనుల్లో చిక్కుకొని కృష్ణ సంగతులు అంతగా తెలుసుకోవడంలేదు. నిన్న నేను విజయవాడ వెళ్ళాను..."

అర్థోక్తిలో కాంతారావు గారు అందుకొన్నారు: "ఐతే అంతా తెలుసుకొన్నావన్నమాట"

"అంతే తెలుసుకోవడమే కాదు, వాడొక పనిచేసి అందరికీ తలవంపులు తెచ్చిపెట్టాడని గూడ తెలుసుకొన్నాను."

"అంటె?"

"అంటె: తప్పతాగి తిరుగుతుంటె పోలీసులు పట్టుకొని జైల్లో పెట్టారన్నమాట!" కాంతారావుగారు వెనక్కి తగ్గారు. కాని మరుక్షణంలోనే ఇదేం పట్టించుకోనట్టు నవ్వి "మంచి పని జరిగింది. ఇప్పుడు తెలిసొస్తుందిలే" అన్నారు. రమణరావు ఆశ్చర్యంగా ఆయనకేసి చూశాడు.

"ఆ తలవంపు మీకు గూడ కలుగుతుందని వూహించారా?"

"నాకెందుకు? వాడు నా కొడుకనా?"

"కాదు అల్లుడని. పోనివ్వండి దానికేం మీరు ఏదో కోపంలో ఆమాట అని వుండొచ్చు. మీ చేజేతులా శాంతగారి జీవితాన్ని నరకప్రాయం చేస్తారంటే నమ్మలేను. కాని ఆలోచించండి: వాడు పెరిగి తిరిగిన వూళ్లోనే అలాంటి తల వంపులైన శిక్ష అనుభవిస్తున్నాడంటె ఆ 'పేరు' ఎవరికొస్తుంది? మీరు కంగారు పడ నవసరం లేదు లేండి... నేను విడిపించుకొన్నాను- నాస్నేహితుడు గాబట్టి, తర్వాత అంతా విన్నానను కోండి. కాని వాడు యిప్పుడు నిజంగా ఎంత పశ్చాత్తాప్పడుతున్నాడంటె, శాంతగారు నన్ను చూడటానికి నిరాకరిస్తే తక్షణం ఎక్కడికో పారిపోవాలనే నిశ్చయానికి వచ్చాడు." అని క్షణమాగి అన్నాడు:

"వాడు చచ్చిపోతాడనుకోండి. వాడి తల్లిదండ్రులు ఏడుస్తారు; ఎందుకు? కనుకొన్నారు గాబట్టి. కాని అది ఒకరి జీవితాన్నే పూర్తిగా నాశనం చేసేస్తుందని మీరు వూహించారా?'

కాంతారావుగారు బిత్తర చూపుల్ని ద్వారం వెనుక నిలబడి నిశ్శబ్దంగా రమణరావు మాటల్ని వింటున్న రెండు జీవుల కేసి సారించారు.

"మాష్టారూ! అన్నీ తెలిసిన మీరు గూడ ఈ విషయాన్ని సునిశితంగా విమర్శించుకోకండా తొందర పడినందుకు నేను చాలా విచారిస్తున్నాను.

"మొట్టమొదట్లో అతను ఎంత సరదాగా శాంతగారితో మాటాడేవాడో ఆమెనే అడిగితే తెలుస్తుంది. నేనొకసారి వాడింటికి వెళ్తే 'డబ్బులేక కాఫీ అలవాట్లు మానుకొన్నాం రా' అని యధార్థ విషయాన్ని నవ్వుతూ నాతో చెప్పేశాడు. వాడి మనస్సు ఎంత నిష్కల్మష మైంది గాకపోతే అంత ధైర్యంగా ఉన్న విషయాన్ని చెప్పగలడు?

"కాని ఆర్థికంగా వాడు బీదవాడు. ఇంట్లో సహజంగా ఎంత అణకువగా తిరిగితేనేం, భార్యని ఎంత ప్రేమిస్తేనేం-ఆ ఒక్క స్వల్పజీతంవల్ల పిచ్చివాడై పోయాడు. చాలనిజీతం, తినేవాళ్లు ఎక్కువ. ఒక్కడు రెక్కలు విరుచుకొని కష్టపడాలి. ఇన్ని చేసినా ప్రతిఫలం తృప్తిగా యివ్వలేని ప్రభుత్వం, ఆఫీసర్ల ఈ సడింపులు-ఇలాంటి సంఘర్షణలమధ్య అనుభవంలేని యువకుడెలా పిచ్చివాడై పోతాడో ఆలోచించండి. ఐనప్పటికీ యింట్లో వాళ్ళమీద చంపుకోలేని సహజమైన ప్రేమ వుండబట్టి వాళ్ళకోసం, వీళ్ళ వాళ్ళనే భేదంలేకండా అప్పులడిగి, వాళ్ళ చేత లేదనిపించుకొని చివరికి యింటికి తిరిగి ఖిన్నుడైవస్తే, చిక్కిపోయిన అబలలు ఎదురుగా కనిపించేసరికి, వాడి బాహ్యప్రపంచపు చిరాకంతా వాళ్ళ మీదికి తిట్లరూపంగా మారడం సైకాలజీ క్షుణ్ణంగా తెలిసిన మీకు నేను చెప్పవలసిన విషయం కాదు. ఈ చిరాకనేది ఒక విధమైన మనస్త్వ దుర్బలతగా మారిపోయి, ప్రతీక్షణం ఎదుటవారిని హింసిస్తూ వుండటంలో ఆశ్చర్యంలేదు. ఇవన్నీ ఆర్థిక అసమర్థతవల్లే నంటారా?" ఆవేశంగా చెప్పుకపోతున్న రమణరావు మాటల్ని కాంతారావుగారు ఆపారు.

"రమణరావ్, యధార్థాన్ని బాగా కనిపెట్టగలిగావోయ్"

"నేను కనిపెట్టడమేముందండి? ధనవంతుణ్ని గాబట్టి నేను కాలుమీద కాలేసుకొని కాలాన్ని విలాసంగా వృధా చేసెయ్యగలను. ముఖ్య కారాణాలు యివంటూ పత్రికల్లో ప్రధాన వ్యాసాల్ని రాయనూగలను. కాని, పాపం, గొడ్డుల్లా కష్టపడే వాళ్ళకే ఈ విషయాలని గురించి విమర్శించుకోనేందుకుగాని, ప్రజల్లో, ప్రపంచంలో తమ హక్కుల్ని గుర్తించుకోనేందుకు గాని, చివరికి తమ మానవత్వాన్ని తెలుసుకోనేందుకుగాని టైంలేదు- అలాంటి వూహగూడ తట్టడంలేదు." అని చిరునవ్వు నవ్వి అన్నాడు: "సరే లెండి. ఇంతసేపూ ఏదో లెక్చరు కొట్టేశాను అసలు విషయం చెప్పకండా...మీ అల్లుడు బయట కార్లో వున్నాడు చూద్దురుగాని రాండి"

"ఎవరు? కృష్ణా?"

"హాఁ కృష్ణే"

ఈ మాటల్ని తలుపు చాటునించి సావధానంగా వింటున్న రెండు జీవాలు, ఈ చివరి మాటలతో ఒకరి ముఖాలొకరు చూసుకొన్నారు చిరునవ్వులతో.

ఇంతలో బయటనించి రాము అల్లరి చేసుకొంటూ వీళ్ళ ఏకాగ్రతని చెడగొట్టాడు. అంతటితో వూరుకోకండా అక్కయ్య చెయ్యపట్టుకొని "అక్కాయ్! బయట కార్లో బావ వున్నాడే...నాన్న అప్పుడు తలమీద కొట్టిన దెబ్బంకా మానేదు" అంటూ కిలకిలా నవ్వాడు.

"ఛా! వెంకిభడవా" అంటూ కోపాన్ని నటిస్తూ తమ్ముణ్ణి విదిలించుకొంది శాంత.

(సమాప్తం)

★

నేనే స్వాస్థ్య అంటే

బిడ్డల పిట్టరూపులను పీకక్కడెస్తా. అన్నిరకాల అనాసల్ని అంతర్ధానం చేస్తా. బాధించే బాలగ్రహ విరోచనాల్ని బంధిస్తా. పెద్దవారి ప్రేగులలోని రోగాల్ని పరిణామసూలల్ని పారద్రోల్తా.

నేనే కావాలంటే

తోలేటి ఆంజనేయులు & సన్

మారుటేరు. :: ప. గో. జిల్లా.